www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 నవంబర్ 2022
5
వైఎస్ఆర్



ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విసి మునగల సూర్య కళావతి శనివారం విడుదల చేశారు. విసి ఛాంబర్‌లో కుల సచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్, ప్రిన్సిపల్ కె.కృష్ణా రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్. ఈశ్వర రెడ్డి, పాలకమండలి సభ్యులు డాక్టర్ వైపి వెంకటసుబ్బయ్య, కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ డాక్టర్ సుబ్బరాయుడుతో కలిసి పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. అనంతరం విసి మాట్లాడుతూ అక్టోబర్‌లో నిర్వహించిన డిపిఇడి పరీక్షలకు 84 మంది విద్యార్థులు హాజరవ్వగా అందరూ ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. బిపిఇడి నాలుగో సెమిస్టర్ పరీక్షకు 81 మంది విద్యార్థులు రాయగా 78 మంది ఉత్తీర్ణులయ్యాయని పేర్కొన్నారు. 96.3శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సందర్భంగా పరీక్షల విభాగాన్ని అభినందించారు.

వరి నూర్పిడి ప్రారంభం

పంట పొలాల్లోనే అమ్మకాలు
జాడ కన్పించని కొనుగోలు కేంద్రాలు



ప్రజాశక్తి - చాపాడు

కుందూ, పెన్నా తీర గ్రామాల్లో ఖరీఫ్ లో సాగు చేసిన వరి పంట నూర్పిడి పనులు ప్రారంభ మయ్యాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి కాస్త ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొం టున్నారు. ధరలు మాత్రం నామమాత్రంగా ఉన్నా యని వాపోతున్నారు. పండిన వరి ధాన్యాన్ని నిల్వ ఉంచుకొని ధరలు వచ్చినప్పుడు అమ్మకాలు సాగించేలా వసతి లేకపోవడంతో పంట పొలా లలోనే అమ్మకాలు సాగించాల్సి వస్తుందని చెబు తున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రకాల సౌకర్యాలు, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటిం చారు. అందుకు అనుగుణంగా రైతుల అంచనా మేరకు కాకపోయినా గత ప్రభుత్వం కంటే కొంత మేరకు వరి పంటకు గిట్టుబాటును అందించారు. సాధారణ వరి వంగడాలకు బస్తాకు(75 కిలోలు) రూ.1461, ఏ గ్రేడ్ రకానికి బస్తా రూ.1476 లకు గిట్టుబాటు ధర ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది వరి నూర్పిడి పనులు ప్రారంభమైనా ఏమాత్రం రైతులకు భరోసాగా నిలవడం లేదని తెలుస్తోంది. జిల్లాలో కేసి కెనాల్, కుందూ,పెన్నా నదులు, తెలుగుగంగా, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి , గండికోట రిజర్వాయర్ల పరిధిలో 1.10 లక్షల ఎకరాలకు పైగా రైతులు వరి పంటను ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు. అధికంగా చాపాడు ,దువ్వూరు, మైదుకూరు మండలాల పరిధిలో కెసి కాలువ కింద 35 వేల ఎకరాలలో వరి పంట సాగైంది. ప్రస్తుతం పంట నూర్పిడి పనులు కుందూ,పెన్నా తీరంలో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వరి పంట దిగుబడి గత ఏడాది కంటే పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు. 32 నుంచి 36 బస్తాల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం వరి ధాన్యాన్ని నిల్వ ఉంచుకునే వసతులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పంట పొలాలలోనే అమ్మకాలు చేపడుతున్నారు. పుట్టి (600 కిలోలు) జిలకర రకం రూ. 11వేలు పలుకుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర కన్నా రూ. 1000 తక్కువకు దళారులు కొనుగోలు చేస్తు న్నారు. దీంతో రైతులకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదు.కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేపడతామనుకుంటే ఎక్కడ అందుబాటులో లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు కావడానికి అలస్యం కావడంతో పంటను పొలాల్లోనే దళారులకు అప్పగిస్తున్నారు. గ్రామాలలో కొనుగోలు కేంద్రాలపై అవగాహన కూడా సరిగా లేదు. 2010లో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో డిసిఎంఎస్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 4 లక్షల బస్తాల వరి ధాన్యాన్ని సేకరించారు .2021లో సచి వాలయాల పరిధిలో కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఇంకా నిబంధనలు అందలేదని తెలు స్తోంది. చాపాడు మండలంలో రోజూ వందలు బస్తాల దాన్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మండల కేంద్రాలలో కొను గోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు గిట్టు బాటు ధర కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది .

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు నిర్ణయించిన ధరకు ధాన్యాన్ని విక్రయిస్తున్నాం. ప్రభుత్వం చర్యలు చేపట్టి దళారులు కూడా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం వర్షాలకు ధాన్యం తడుస్తుందని దళారులు నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేపడుతున్నాం. ప్రభుత్వం కొనుగోలుకు శ్రీకారం చుట్టాలి.

-వి.వీరారెడ్డి,అయ్యవారిపల్లె, చాపాడు.

దళారులు లాభపడుతున్నారు



ఆరుగాలం కష్టపడి, పెట్టుబడులు పెట్టిన రైతుల కంటే చివరి నిమిషంలో కొనుగోలు కోసం వచ్చే దళారులు అధికంగా లాభపడుతున్నారు. ఈ ఏడాది 3 ఎకరాల్లో సాగు చేసిన వరి వర్షానికి నేలకొరిగి దిగుబడి తగ్గింది. దళారులు రోజుకు ఒక రేటు నిర్ణయిస్తూ వారు సూచించిన ధకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి చేసి గిట్టుబాటు ధర కల్పించాలి. రైతులకు ఉపయోగం ఉండేలా కొనుగోలు చేపట్టాలి.

- వెంకట రమణ, అయ్యవారిపల్లె, చాపాడు

'ఉరుసు' విజయవంతానికి సహకరించండి

- కలెక్టర్ వి.విజయరామరాజు


పెద్దదర్గా ఉరుసు ఉత్సవ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

డిసెంబర్ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించబోయే అమీన్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలను జిల్లా అధికారులు, దర్గా కమిటీ సభ్యులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాల్‌లో అమీన్ పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులు, దర్గా కమిటీ సభ్యులతో అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫ్ ఉల్లా హుసేనీతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్‌పి అన్బురాజన్, జెసి సాయికాంత్‌వర్మ, కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్, డిఆర్‌ఒ గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కోవిడ్ వల్ల ఉరుసు ఉత్సవాలను పరిమిత సంఖ్యలో నిర్వహించుకున్నామని పేర్కొన్నారు. ఉరుసు ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. తరతరాలుగా సర్వమతాల సంస్కృతికి ప్రతీకగా వెలుగొందుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా కలిసికట్టుగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేసి విజయవంతం చేయాలన్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ ఏర్పాట్లను చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరు, హై మాస్ట్ లైట్లు, మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉరుసు మహోత్సవాల సమయంలో ఆహార పదార్థాల్లో క్రమం తప్పకుండా సోడియం హైపోక్లోరైడ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించే ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా కట్టుదిట్టమైన గట్టి బందోబస్తు, నిర్దేశించిన ప్రధాన ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్‌పికి సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బంది తో పాటు ,మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్‌ఒ డా.నాగరాజుకు చెప్పారు. 108 , 104 అంబులెన్స్ , అత్యవసర మందులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ ఏర్పాట్లలో షార్ట్ సర్క్యూట్ అవకుండా, నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ట్యాంకర్‌లను అందుబాటులో ఉంచుకోవాలని ఫైర్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం నుంచే కాక దేశ, విదేశాలనుంచి కూడా యాత్రికులు ఈ ఉరుసు ఉత్సవాలకు వస్తుంటారని వారికి ఇబ్బందులు కలుగకుండా అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ , రైల్వేస్టేషన్ నుంచి దర్గా వరకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఆటో వాలాతో మాట్లాడి వివిధ పాయింట్ల నుంచి దర్గా వరకు ధరలను ఫిక్స్ చేయాలని డిటిసికి సూచించారు. కార్యక్రమంలో డిఆర్ దేవరాజ్, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి కృష్ణకిషోర్, దర్గా కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు తగవు : ప్రజా సంఘాలు

ప్రజాశక్తి - బద్వేలు

ప్రత్యేక హోదా, కడప ఉక్కు, విభజన హామీలు అమలు చేయని ప్రధానమంత్రి మోడీ విశాఖపట్నం రాకను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన నిరసన కార్యక్రమాలు చేస్తున్న ప్రజా సంఘాల నాయకులను, కార్మిక సంఘ నాయకులను అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గం సిపిఐఎం, ఐద్వా, వృత్తిదారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి కె. నాగేంద్రబాబు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని సంయుక్తంగా మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి దుర్మార్గ పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర పడ్డాయని, స్టీల్ ప్లాంట్ అమ్మకానికి పెట్టిన కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించడం శోచనీయమన్నారు. ఉక్కు కార్మికుల పోరాటానికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కదిలొచ్చి మద్దతు తెలిపి కేంద్రాన్ని నిలదీయాలన్నారు. రాష్ట్రానికి రావాల్సిన హామీలు విభజన చట్టంలో పొందుపరిచిన కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పొంగూరు నాగరాజు, డివైఎఫ్ఐ పట్టణ నాయకులు గంగనపల్లి నాగార్జున, సిఐటియు నాయకులు డి. హరి, ఐద్వా మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యులు యం.గౌతమి, పట్టణ అధ్యక్షురాలు జి.అనంతమ్మ, పట్టణ నాయకురాళ్లు మస్తానమ్మ, నాగేశ్వరి పాల్గొన్నారు.

'సిటు' జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కడప అర్బన్


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

సిఐటియు జిల్లా 9వ మహాసభలు డిసెంబర్ 29, 30 తేదీలలో నగరంలో నిర్వహిస్తున్నామని, ప్రతి కార్మికుడు పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ తెలిపారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిరంతరం కష్టజీవులు, శ్రమజీవుల పక్షాన అహర్నిశలు పనిచేస్తూ ఉద్యమ మాలే ఊపిరిగా పనిచేస్తున్న సంఘం సిఐటియు అని తెలిపారు. ఇవాళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోపభూయిష్ట విధానాల ఫలితంగా కార్మిక వర్గం పై పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానం నుంచి 12 గంటల పని విధానం వరకు పెంచారని తెలిపారు. అసంఘటితరంగా కార్మికులకు పని భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని చెప్పారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే ఈ మహాసభలలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకు వెళదామని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. మహాసభల సందర్భంగా కడప నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ, ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఎం.ఎ. గఫూర్, సిఐటియు రాష్ట్ర కార్య దర్శి ఎం. బాల కాశి తో పాటు జిల్లా ముఖ్యమైన నాయకత్వం పాల్గొంటుందని తెలి పారు. మహాసభలను జిల్లా కార్మిక వర్గ సోదరులు, ప్రజాతంత్ర మేధావులు, మహా సభ జయప్రదం కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. లక్ష్మీదేవి పాల్గొన్నారు.

జమీల్‌పై దాడి హేయం : టిడిపి


జమీల్ తల్లిని ఓదారుస్తున్న టిడిపి నాయకులు అమీర్‌బాబు

కడప అర్బన్ : టిడిపి నాయకులు జమీల్‌పై దాడి హేయనీయమని కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ వి.ఎస్. అమీర్‌బాబు పేర్కొన్నారు. శనివారం వైసిపి దాడిలో గాయపడిన జమీల్ తల్లికి ఆయన ధైర్యం చెప్పి పరామర్శించారు. వైసిపి నాయకులు కడప నగరంలో భూ కబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శి ంచారు. డిప్యూటీ సిఎం అంజాద్ బాషా తమ్ముడు అహ్మద్ బాషా నాలుగు సెంట్ల స్థలం కోసం కొంతమంది రౌడీలతో టీడిపి పార్లమెంట్ నగర కార్యదర్శి జమీల్ తమ్ముడిపైన కట్టెలతో, రాడ్డులతో దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. అభివృద్ధిపైన దృష్టి పెట్టకుండా టిడిపి నాయకులపైన కక్ష సాధింపు చర్యలు చేపట్టారని విమర్శించారు. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీసులే అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదవులు ఎవరికి శాశ్వతం కాదని టిడిపి అధికారంలోకి వస్తుంది గుర్తు పెట్టుకోండి అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు జలతోటి జయకుమార్, షేక్ ఇమ్రాన్, సుబ్బ రాయుడు పాల్గొన్నారు. **కేసు పెట్టడం దారుణం..**వినాయక నగర్ స్థల వివాదంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా తమ్ముడు అహమద్ బాషా తన అనుచరులతో టిడిపి నాయకులు జమీల్ పై దాడి చేయడం దారుణమని టిడిపి నాయకులు హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం హరి టవర్స్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ నాయకుల పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని తాలూకా పోలీసులను కొడితే ఇంతవరకు నమోదు చేయలేదని చెప్పారు. కార్పొరేషన్ అధికారులతో దాడిలో గాయపడిన టిడిపి వారిపై కేసు పెట్టించడం దుర్మార్గమన్నారు. ఎటువంటి సంబంధం లేని సుబ్బారెడ్డి పై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

కొప్పుల విజయ్‌కుమార్‌కు ఎక్సలెన్సీ అవార్డు

ప్రజాశక్తి - కడప అర్బన్



అవార్డు అందుకుంటున్న విజయ్‌కుమార్

సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డును తమిళనాడులోని హెసూర్‌లో శనివారం ఇంటర్నేషనల్ అచివర్స్ కౌన్సిల్, ఆసియన్ వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇంటర్నేషనల్ అచివర్స్ కౌన్సిల్ నుంచి చేసిన సేవలను గుర్తించి అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డు రావడంతో మరింత ఎక్కువ భాద్యత పెరిగిందన్నారు.

టీచర్ల బదిలీలపై స్పష్టతనివ్వాలి

కడప అర్బన్ : ప్రభుత్వ ఉపాధ్యాయుల సాధారణ బదిలీలు ఉంటాయో, ఉండవో స్పష్టం చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎన్‌జిఒ హోమ్‌లో ఎపిటిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల జీవో సిద్ధంగా ఉందని రెండు మూడు రోజుల్లో విడుద లవుతుందని సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి చెప్పి నెల రోజులవుతున్నా ఇంతవరకు ఉపాధ్యాయ బదిలీలపై స్పష్టమైన ప్రకటన వెలువడకపోవడం వల్ల రాష్ట్రంలోని ఉపాధ్యాయులు గందరగోళంలో ఉన్నారన్నారు. అర్హతలున్న స్కూల్ అసిస్టెంట్లకు జూనియర్ లెక్షరర్లుగా ఉద్యోగోన్నతలు కల్పించాలన్నారు.

గురుకుల పాఠశాలలో గ్రంథాలయ వారోత్సవాలు

పోరుమామిళ్ల : గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బి కోడూర్ మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కళాశాల గ్రంథ పాలకుడు సి ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ నిరంజన్ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఈనెల 14న పుస్తక ప్రదర్శన, 15న వ్యాసరచన పోటీలు, 16న వక్తృత్వ పోటీలు, 17న డ్రాయింగ్ పోటీలు, 18న స్వాతంత్ర సమరయోధుల పుస్తక ప్రదర్శన, 19న పద్య పోటీలు ,20న వారోత్సవాల ముగింపు వేడుకలు నిర్వహిస్తామని తెలిపారు.

అట్లూరులో అత్యధిక వర్షపాతం

కడప : అట్లూరు మండలంలో అత్యధికంగా 41.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు మండలాల వారీగా ఇలా ఉన్నాయి. కడపలో 15.2, కమలాపురంలో 2.4, వల్లూరులో 12.4, చెన్నూరులో 8.2, చింతకొమ్మదిన్నె మండలంలో 11.2, పెండ్లిమర్రిలో 11.4, ఖాజీపేటలో 8.6, ఒంటిమిట్టలో 17.4, సిద్దవటంలో 21.6, బద్వేలులో 13.2, బి.మఠంలో 6.2, శ్రీకాశినాయన మండలంలో 3.0, బి.కోడూరులో 1.2, గోపవరంలో 11.8, ఎస్.మైదుకూరులో 2.0, రాజుపాళెంలో 1.4, ప్రొద్దుటూరులో 0.8, పులివెందులలో 13.2, వేములలో 8.2, వి.ఎన్.పల్లిలో 8.2, వేంపల్లిలో 7.8, చక్రాయపేటలో 2.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సగటున 6.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

ఆక్రమణల జోరు!

ప్రజాదృష్టి

జిల్లాలో ఆక్రమణలు జోరు స్పీడందుకుంది. ఇందుకు అధికార వైసిపి నాయకత్వం బాధ్యత వహించాలి. కడప నగరంలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు కన్నేయడం షరామామూలుగా మారిపోయింది. ఇటీవల జిల్లాలోని ఓ ఎమ్మెల్యే నగర శివారులోని ఓ అపార్ట్‌మెంట్‌కు సమీపంలోని ఖాళీ స్థలాన్ని రహదారి కింద మార్చుకున్న వైనం విమర్శలకు ఆస్కారాన్ని కలిగించింది. ఇదేమిటని అడిగిన వారిని అధికార యంత్రాంగం పట్టించుకునే సాహసం చేయడం లేదు. గతంలో బుగ్గవంక లేఅవుట్ పరిధిలోని వందలాది సామాన్యుల ఇళ్లను కూలగొట్టిన ఇరిగేషన్, రెవెన్యూ, కార్పొరేషన్ అధికార యంత్రాంగం సదరు ఎమ్మెల్యే సినిమా థియేటర్ కోసం లే అవుట్‌ను మార్చిన సంగతి తెలిసిందే. శుక్రవారం రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల సమయంలో వైసిపి కడప టికెట్ రేసులో పేరు విని పిస్తున్న ఓ మైనార్టీ నాయకులు నగరంలోని వినాయక నగర్‌లోని ఇతరుల స్థలా లపై కన్నేసిన వారికి అండగా నిలవడం చర్చనీయాంశమైంది. పెద్ద మనుషుల తరహాలో పిలిపించడం దాడికి పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. రెండేళ్ల కిందట ప్రొద్దుటూరు పట్టణంలోనూ ఇదేతరహాలో దాడికి పాల్పడి ఒకరిని హత్య చేసిన సంగతి తెలిసిందే. ఇటువంటి నయా పెద్ద మనుషుల అవతారం ఎత్తిన నాయకులు ఎంతకైనా తెగించడం పరిపాటిగా మారింది. రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాయకగణం ఇటువంటి దాడులు, దౌర్జన్యాలకు పాల్పడడం జుగుప్సను కలిగిస్తోంది. అధికారం శాశ్వతం కాదని తెలిసినప్పటికీ అమానుష దుష్కృత్యాలకు పాల్పడడం అవివేకమని గుర్తించాలి. జిల్లాలో ఇటీవలి కాలంలోని ఆక్రమణలు, దౌర్జన్య పర్వాలను పరిశీలిస్తే పెద్దమనుషుల తరహాలో పంచాయతీ పేరుతో పిలిపించుకోవడం, బెదిరించడం, మాట వినక పోతే దాడులు, హత్యలకు పాల్పడడం మాఫియా సంస్కృతిని తలపిస్తోంది. జిల్లా పోలీసు, రెవెన్యూ యంత్రాంగాలు అధికారంలో ఉంటూ దౌర్జన్యపరులకు వత్తాసు పలుకుతున్నారు. అనాది నుంచి వస్తున్న సంప్రదాయం ప్రకారం పెద్ద మనుషులు పంచాయతీ పేరుతో పిలిస్తే వెళ్లి పంచాయతీకి అంగీకరించ డమనే గౌరవ, మర్యాదలకు కాలం చెల్లిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఇటీవలి కాలంలో ఇటువంటి ఆక్రమణలు, దౌర్జన్యాలు అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకుల మధ్య తరుచుగా చోటుచేసుకోవడం షరామామూలుగా మారింది. రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులదే పైచేయిగా మారుతున్న సంగతి తెలిసిందే. ఏదే మైనా పోలీస్, రెవెన్యూ అధికార యంత్రాంగాలు నిజాయితీగా వ్యవ హరించి సమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. ఇటువంటి ప్రజాస్వామ్య పద్ధతుల్లో సమస్యల్ని పరిష్కరించుకోవాల్సింది పోయి భౌతికదాడులు, దౌర్జన్యాలు, హత్యలకు పాల్పడడం వంటి ఆగడాలను అరి కట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జాతీయ లోక్ అదాలత్‌లో 11,262 కేసులు పరిష్కారం

- రూ.1.83 కోట్లు కక్షిదారులకు చెల్లింపు

ప్రజాశక్తి - కడప

జిల్లా న్యాయసేవా అధికార సంస్థ (డిఎల్‌ఎస్‌ఎ) ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా 27 బెంచీలను ఏర్పాటు చేసి జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు అందిన సమాచారం మేరకు జిల్లా వ్యాప్తంగా 11262 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించి, కక్షిదారులకు రూ.1కోటి 83లక్షల 67వేల512లు చెల్లించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.సోలమన్ రాజు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.కవిత తెలిపారు. రాయచోటి ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి కోర్టులో ఎంవిఒపి నెంబర్ 89/2016 కేసులో రూ.38లక్షలకు వాదులు ప్రతివాదులు, రాయల్ సుందరం ఇన్సూరెన్స్ కంపెనీ వారు లోక్ అదాలత్‌లో రాజీ పడ్డారు. ఈ కేసులో న్యాయవాదులు పి.విజయ్‌భరత్‌రెడ్డి, డి.రాజశేఖర్‌రెడ్డి వాదించారు. అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం అయ్యేందుకు సహకరించిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు అధికారులకు, వైద్యాధికారులకు, రవాణా శాఖ అధికారులకు, లేబర్ శాఖ అధికారులకు, మున్సిపల్ సిబ్బందికి, బిఎస్‌ఎన్‌ఎల్, ఎపిఎస్‌పిడిసిఎల్ అధికారులకు, ఎక్సైజ్ అధికారులకు, రైల్వేశాఖ అధికారులకు, అగ్రికల్చర్ అధికారులకు, అన్ని శాఖల వారికి ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కృతజ్ఞతలు తెలియజేశారు.

హోదా అమలు చేయలేని మోడీ గోబ్యాక్



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప : ఎపికి ప్రత్యేక హోదా అమలు చేయకుండా మళ్లీ రాష్ట్రానికి వచ్చిన ప్రధాని నరేంద్రమోడీ గోబ్యాంక్ అంటూ కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం కలెక్టరేట్ ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు, నగరా అధ్యక్షుడు వై. విష్ణు ప్రీతం రెడ్డి, పిసిసి డెలిగేట్ బండి జకరయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన సందర్భంలో అప్పటి యుపిఎ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు ఐదు సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇచ్చిందని, తరువాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఎనిమిదేళ్లయినా అమలు చేయకపోవడం శోచనీ యమ న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల కోట్ల మేర ఎపికి ఇస్తే మోడీ ప్రభుత్వం ఒట్టి చేతులు చూపిందని వాపో యారు. కార్యక్రమంలో సత్తార్, చార్లెస్, తిరుమలేష్, రాష్ట్ర మైనార్టీ నేత ఆరిపుల్లా, శ్రీనివాసులు, బీసీ సెల్ జిల్లా చైర్మన్ నూకల చిన్న కులయప్ప, మహిళా జిల్లా అధ్యక్షురాలు శ్యామ లాదేవి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, ఎన్ ఎస్ యు ఐ జిల్లా అధ్య క్షుడు మామిళ్ళ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

సాహిత్య కృషి గొప్పది

కడప అర్బన్ : పద్యకవిగా పాలా వెంకటసుబ్బయ్య, అవధానిగా సి.పి.సుబ్బన్న సాహితీ కృషి గొప్పదని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం సాయంత్రం ప్రసిద్ధ పద్యకవి పాలా వెంకటసుబ్బయ్య 110వ జయంతి, ప్రసిద్ధ అవధాని సి.వి.సుబ్బన్న 94వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాలా వెంకటసుబ్బయ్య సి.వి.సుబ్బన్న చిత్రపటాలకు పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గంధపాలకులు ఎన్.రమేశ్‌రావు, కుమార్, సాయిరామ్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ట్రస్టు లక్ష్యం

ఒంటిమిట్ట :పేదలను అదుకోవడమే నూరుల్లా ఇస్లామ్ ట్రస్ట్ అధినేత అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని మలకాటి గ్రామం వద్దనున్న నూరుల్లా ఇస్లామ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు, ఇమామ్‌లకు, మౌజన్లకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా ప్రతి రెండో శనివారం పేదలకు సాయం చేస్తున్నామని చెప్పారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు పేదలకు ఆదుకోవాలని సూచించారు. పురాతన ఆయూష్ వైద్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేదంలో అన్ని రకాల జబ్బులకు మంచి మందు లున్నాయని తెలిపారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందజేశారు.

మైనార్టీలపై కపట ప్రేమ : టిడిపి

ప్రజాశక్తి-చెన్నూరు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీలపై కపట ప్రేమ చూపుతోందని, ముస్లిముల పవిత్రను కాపాడాలని ఉంటే హౌజ్‌హస్‌ను మనుగడలోకి తీసుకు రావాలని టిడిపి మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్, ఖాజాహుసేన్, మంజూర్‌అహ్మద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మండలంలోని మైనార్టీ కాలనీలో శ్మశాన పనులకు, సిసి రోడ్లకు అనేక లక్షలు ఖర్చు చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో హజ్ హౌస్‌ను నిర్మిస్తే వైసిపి ప్రభుత్వం పూర్తిగా వదిలేసిందని వాపోయారు. 90 శాతం పనులు పూర్తయిందని, మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేయకుండా అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మార్చారని ఆవేదన వ్యక్తంచేశారు. మూడున్నర సంవత్సర పాలనలో మైనార్టీ కాలనీలో దిష్టిబొమ్మలాగా సచివాలయం నిర్మించారే తప్ప అభివృద్ధి మరిచారని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి మూడున్నర సంవత్సరాలు కావస్తున్న ఖిల్లా మసీదు కమిటీ ఇంతవరకు ఏర్పాటు చేయలేదని వాపోయారు. మైనారిటీ శాఖ మంత్రికి కూత వేటు దూరంలో ఉన్న హజ్ హౌస్ కనిపించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కమలాపురం నియోజకవర్గంలో మైనారిటీలకు పుత్తా నరసింహారెడ్డి హయాంలో లబ్ధి చేకూరిందని తెలిపారు. సమావేశంలో మైనార్టీ నాయకులు గౌస్ పీర్, ఖాజా, అబ్దుల్లా, సాధిక్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి కడప అర్బన్



అన్నదానం చేస్తున్న డాక్టర్ జనార్ధననాయుడు

ప్రముఖ పారిశ్రామికవేత్త నవీన్ కుమార్ కార్తీక్ పుట్టినరోజు సందర్భంగా శనివారం సాయిబాబా అనాధ ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ డాక్టర్ జనార్ధననాయుడు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి అనాధలకు, అయ్యప్ప మాల భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీన్‌కుమార్ కార్తీక్ పుట్టినరోజు వేడుకలను అనాధల మధ్య నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్తీక్ అభిమాని నగేష్ మాట్లాడుతూ వ్యాపార రీత్యా ఢిల్లీలో ఉండడంతో నవీన్ కుమార్ కార్తీక్ పుట్టినరోజు వేడుకల్లో ప్రత్యక్షంగా పాల్గొనలేకపోయారని చెప్పారు. భవిష్యత్తులో ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో చంద్ర, గోపి, వెంకటేష్, మౌళి పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థులకు అవగాహన

కడప అర్బన్ : కెఎస్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 2022- 23 విద్యా సంవత్సరానిగాను బీటెక్ మొదటి సంవత్సరం ప్రవేశించిన విద్యార్థులకు కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్స్ కెరీర్ డెవలప్మెంట్ సెల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నైతిక విలువలు, ఎథిక్స్ గోల్డ్ సెట్టింగ్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంచుకున్న ఇంజినీరింగ్ బ్రాంచ్‌పై మంచి అవగాహనతో పాటు తోటి విద్యార్థులు, అధ్యాపకులు మధ్య సంబంధాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కమ్యూనికేషన్స్, ఇతర నైపుణ్యాలను అవగాహన ఆకలింపు చేసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ శ్రీవాణి, సమన్వయకర్తలు ఈశ్వర్ రెడ్డి, రాజేంద్ర కుమార్, ఆనందరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాటింగ్‌లో రాణించిన శ్రీధర్



కడప: కడప జట్టుకు చెందిన జి.శ్రీధర్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించడంతో హైదరాబాదు జట్టుపై కడప జట్టు 9 వికెట్ల తేడాతో తొలి మ్యాచ్ ఘన విజయం సాధించింది. హైదరాబాదులో శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప మాస్టర్స్ జట్టు, హైదరాబాదు వెటరన్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. హైదరాబాదు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. 121 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప మాస్టర్స్ జట్టు 12.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 121 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని జి.శ్రీధర్ 85 పరుగులు(నాటౌట్) చేసి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

ప్రజాదరణ నాయకుడు 'వరద'

- మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గొప్ప ప్రజాదరణ పొందిన నాయకుడు మాజీ ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డి అని మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య పేర్కొన్నారు. స్థానిక నెహ్రూ రోడ్డులోని వరద కార్యాలయంలో శనివారం పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వరద అభిమానులు పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చి, భారీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ తమ నాయకుడు 25ఏళ్ళ నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యేగా సేవలు అందించారని కొనియాడారు. నిస్వార్ధపరుడు, నిరాడంబరుడు అయిన తమ నాయకుడు ఆయురారోగ్యాలతో కలకాలం జీవించి ప్రజలకు మరిన్ని సేవలను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ మునిసిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, అన్నవరం రామ్మోహన్‌రెడ్డి, రఘురామ్ గౌస్, అమీర్, బద్వేల్ శ్రీనివాసులు రెడ్డి, వెంకట కొండయ్య, నాగముని రెడ్డి, రామాపురం గురివిరెడ్డి, పలువురు మాజీ కౌన్సిలర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న వరద అభిమానులు

బిజెపి, జనసేన కలయికతో ఒరిగేదేమీలేదు

- పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

బిజెపి, జనసేన పార్టీ కలవడం వల్ల ఒరిగేదేమీలేదని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రానికి పంగనామం పెట్టిన బిజెపితో పొత్తు పెట్టుకోవడానికి జనసేన పార్టీ పాకులాడడం శోచనీయమని తెలిపారు. సున్నాకి, సున్నాకి రాసుకుంటే బూడిద రాలినట్లు వారి కలయిక వల్ల ఒరిగేదేమీ ఉండదన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన పార్టీల్లో బిజెపి నంబర్ వన్ అని పేర్కొన్నారు. ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీక అయిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని బిజెపి అమ్మకానికి పెట్టిందని మండిపడ్డారు. రాష్ట్రంలో బిజెపి పరిస్థితి గొర్రె తోక బెత్తెడే అన్నట్టుందని అన్నారు. రాష్ట్రానికి చేసిన అన్యాయంతో ఆ బెత్తెడు తోక కూడా ఊడిపోయిందని విమర్శించారు. గత ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు పవన్ రెండు చోట్ల పోటీ చేసిన ఒక్కచోట కూడా గెలవలేదన్నారు. ఒక ఎమ్మెల్యే మాత్రమే గెలిచినప్పటికీ ఆయన కూడా పార్టీ మారిపోయాడని చెప్పారు. ఇలాంటి పార్టీలు కలిసి అద్భుతాలు జరుగుతాయని అనుకోవడం అవివేకమని తులసిరెడ్డి తెలిపారు.

వేమనను అవమానించడం దురదృష్టకరం

ప్రజాశక్తి - చాపాడు

వైవియూలో వేమనను అవమానించడం దురదృష్టకరమని కడప పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి పి.మునిశేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో వేమన విగ్రహాన్ని తొలగించి వైయస్ విగ్రహం పెట్టడం ప్రభుత్వానికి మంచి పద్ధతి కాదన్నారు. ఆంగ్లేయుడైన సిపి బ్రౌన్ వేమన పద్యాలు సేకరిస్తే తెలుగువాడైన సిఎం జగన్ తెలుగు భాష విధ్వంసకుడిగా తయారు కావడం బాధాకరమన్నారు. ఈ సంఘటనపై గవర్నర్ స్పందించి వేమన విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని టిడిపి తరఫున డిమాండ్ చేస్తున్నామన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిస్తాయని వైసిపి పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైయస్ భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని శని వారం పులివెందులలో వైయస్ భాస్కర్‌రెడ్డి నివాసం వద్ద పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజూ రోజు ఏదోక సమయంలో గ్రంథాలయాలకు వెళ్లాలని కోరారు. అక్కడ ఉన్న పుస్తకాలను చదవడం వల్ల ఎంతో జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చునని పేర్కొన్నారు. ముఖ్యంగా కడప జిల్లా గ్రంథాలయ చైర్మన్ లింగాల శివశంకర్‌రెడ్డి జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ వాటి పురోగతిని పరిశీలిస్తున్నారని తెలిపారు. అవసరమైన పుస్తకాలను తెప్పిస్తూ అభివృద్ధికి నాంది పలకడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వేముల మండల పరిశీలకులు లింగాల రామలింగారెడ్డి (డేలుల రాము), మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజ్, లైబ్రరీ కృష్ణకిషోర్ పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైయస్ భాస్కర్‌రెడ్డి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చక్రాయపేట

విద్యుత్ పనుల వల్ల ఆదివారం ఉదయం 8నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎఇ ఆర్.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. 33/11 కెవి నాగులగుట్టపల్లి, సిద్దారెడ్డిగారి పల్లి, కుప్పంరాజు పల్లి సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు.

ప్రధాని రాష్ట్రానికి ఏంచేశారని సందర్శించారు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రధాని మోడీ రాష్ట్ర పర్యటన సందర్భంగా సిపిఎం శని వారం నిరసన కార్యక్రమం చేపట్టింది. సిపిఎం కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం రాజీవ్ సర్కిల్‌లో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమస్యల పరిష్కారాలను పూర్తిగా వదిలేసిన బిజెపి ప్రభుత్వానికి మాట్లాడే అర్హత లేదన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా, కడప స్టీల్ ప్లాంట్ ఇవ్వకపోయినా వైసిపి ప్రభుత్వం కేంద్రానికి సహకరించడం మంచిది కాదన్నారు. ప్రతిపక్షం టిడిపి, జనసేన బిజెపితో దోస్తీ కట్టాలని చూడడం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన పార్టీలుగా మిగిలిపోతాయన్నారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు పక్కీరయ్య, సరేశ్వరి, మహిళా సంఘం నాయకులు వెంకటసుబ్బయ్య, రామలక్ష్మి, శేఖర్, హుసేన్‌బాషా, ఏసు, చెన్నారెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు సత్యనారాయణ

ఉచిత కేన్సర్ వైద్య శిబిరం విజయవంతం

చాపాడు(మైదుకూరు) : స్థానిక ఎస్‌ఎల్‌ఆర్ వైద్యశాలలో శనివారం నిర్వహించిన ఉచిత కేన్సర్ పరీక్ష వైద్య శిబిరం విజయవంతమైందని ఆ ఆస్పత్రి ఎండి మాలె రామానిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ శిబిరంలో 70 మందిని పరీక్షించి చికిత్స అవసరమైన వారికి నెల్లూరులోని మెడికవర్ కేన్సర్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. వైసిపి కడప పార్లమెంట్ అధ్యక్షులు సురేష్‌బాబు హాజరై నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, రిమ్స్ అభివృద్ధి కమిటీ సభ్యులు సరస్వతీదేవి, డాక్టర్ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యం

ముద్దనూరు : వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గంగాదేవిపల్లిలో శనివారం ఆయన బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ నాయకులు, కార్యకర్తలు పూలమాలలతో ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసిపి వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టిడిపి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపికి ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి రామాంజనేయులు, పార్టీ కార్యదర్శి శ్రీనివాసులు, గ్రామ నాయకులు అబ్బాస్, చిన్ని రెడ్డి, కేశవ రెడ్డి, పెద్ద కేశవ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, చెన్నారెడ్డి, రమణారెడ్డి, చంద్రప్రసాద్ రెడ్డి, చంద్రప్రతాప్ రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అండగా ఉండాలని భూపేష్‌రెడ్డికి వినతి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

తమకు న్యాయం జరిగే వరకు అండగా ఉండాలని ఆర్‌టిపిపిలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులు జమలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డిని కోరారు. దేవగుడి గ్రామంలో శనివారం ఉదయం సిఐటియు అనుబంధ సంస్థ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ ఆయనను కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ఆర్‌టిపిపిని నమ్ముకుని దశాబ్దాల తరబడి చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నామన్నారు. ఎప్పటికైనా ఉద్యోగం రెగ్యులర్ కాకుండా పోతుందా అని ఎదురుచూస్తూ ఉన్నామన్నారు. జిఒ 163 ప్రకారం వారికి అనుకూలమైన 37 మందిని నేరుగా రెగ్యులర్ ఆర్డర్‌తో ఉద్యోగాలు ఇచ్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌టిపిపిలో పనిచేసే కార్మికులకు కూడా ప్రత్యేక జిఒ తెచ్చి 1600 పైచిలుకు కార్మికులందరినీ భేషరతుగా రెగ్యులర్ చేయాలని కోరారు. కార్మికులు చేసే నిరసన, సమ్మెలకు మీ వంతు మద్దతు ఇవ్వాలని భూపేష్‌రెడ్డిని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ ఆ మేరకు హామీ ఇచ్చారు. సమస్యను మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఆర్‌టిపిపి కార్మికులు

సేవలకు గుర్తింపుగా డాక్టరేట్ ప్రదానం


కుటుంబ సభ్యులతో డాక్టరేట్ పొందిన మధుసూదన్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

నిరుపేద కుటుంబంలో జన్మించిన ముద్దనూరుకు చెందిన కటికరెడ్డి మధుసూదనరెడ్డి అంచెలంచెలుగా ఎదిగి ప్రజలకు చేస్తున్న ఎన్నో సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా అరుదైన గౌరవం ఆయనను వరించింది. మధుసూదనరెడ్డి కులమతాలకు అతీతంగా ప్రజలకు అందించిన మహోన్నత సేవా కార్యక్రమాలను గుర్తించిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఆసియా వేదిక్ కల్చరల్ రీసెర్చ్ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌కు ఎంపిక చేసింది. అవార్డు ప్రదానం చేసి ఆయనను సత్కరించింది. కుటుంబ సభ్యులతో కలిసి అవార్డు అందుకున్నారు. ప్రతి ఏడాది అన్ని పండుగలకు పలు సేవా కార్యక్రమాలను అందించారు. ఉచిత అంబులెన్స్, ఫ్రీజర్ బాక్స్ ఏర్పాటు చేశారు. ఉచిత మెగా వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించారు. పేద విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందజేశారు. కరోనా కష్ట కాలంలో ఉన్న ముద్దనూరు ప్రజలకు తన వంతు సాయంగా నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించి ఇలాంటి పురస్కారాలు అందుకోవాలని పలువురు ఆకాంక్షించారు. మధుసూదన్‌రెడ్డి డాక్టరేట్ పొందడం పట్ల కుటుంబ సభ్యులు, ప్రజలు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి కాంతమ్మ, ఆయన కూతుర్లు డాక్టర్లు కటికరెడ్డి లిఖితారెడ్డి, సంఘవీరెడ్డి, కుమారుడు గుణవంతరెడ్డి పాల్గొన్నారు.

జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డికి సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లా ఆహార సలహా మండలి సభ్యుడిగా వేంపల్లె జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి నియమితులయ్యారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జడ్‌పి సిఇఒ సుధాకర్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. రవికుమార్‌రెడ్డిని జిల్లా ఆహార సలహా మండలి సభ్యులు ఎంపిక చేయడంతో శనివారం బలిజ సంఘం అధ్యక్షులు నం బూరు కుళాయప్ప, కటిక చంద్రశేఖర్, పద్మా రాజ్‌కుమార్, వార్డు మెంబర్ ఆంజనేయులు, పలువురు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ పదవికి వన్నె తెచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. తనను నియమించినందుకు సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తనను అభినందించిన ప్రజాప్రతినిధులకు, నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు దోసెల శివయ్య, కొత్తూరు రెడ్డయ్య, ముత్యాల బాబు, మాజీ సర్పంచు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.


రవికుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న బలిజ సంఘం నాయకులు



విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని బిసి గర్ల్స్ హాస్టల్‌లో ఆయుష్ గ్రామ్, హర్‌దిన్ హర్ ఘర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ హాస్టల్ వార్డెన్ సుజాత దేవితో కలిసి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులను పరీక్షించి అవసరమైన మందులను పంపిణీ చేశామన్నారు. అలాగే యోగ ఆవశ్యత గురించి విద్యార్థులకు యోగా సెషన్ నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో 72 మంది విద్యార్థులకు మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కాంపౌండర్ రాజారెడ్డి, యోగా శిక్షకులు లక్ష్మీరాజు, సునంద, తిరువెంగళప్ప పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు, స్కార్పియో స్వాధీనం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు పోలీసుస్టేషన్ పరిధిలోని లంకమల అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలిస్తున్న 8 ఎర్రచందనం దుంగలను, స్కార్పియోను స్వాధీనం చేసుకున్నామని శనివారం సిఐ బివి చలపతి తెలిపారు. ఎర్రచందనం చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ఓ వ్యక్తిని కూడా అరెస్టు చేశామన్నారు. ఎస్‌పి అన్బురాజన్, మైదుకూరు డిఎస్‌పి వంశీధర్ గౌడ్ ఆదేశాల మేరకు శుక్రవారం అర్బన్ ఎస్ఐ ఘణ మద్దిలేటి, సిబ్బంది ఖాజీపేట ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ జాకీర్ హుస్సేన్‌తో కలిసి లంకమల్ల రిజర్వ్ ఫారెస్ట్‌లో తనిఖీలు చేపట్టారన్నారు. అక్కడ కొందరు వ్యక్తులు ఎర్ర చందనం దుంగలను ఒక కారులోకి ఎక్కిస్తూ కనిపించారన్నారు. వారిని పట్టుకోడానికి ప్రయత్నించగా వారు రాళ్ళతో దాడికి యత్నించి తప్పించుకున్నారన్నారు. సిబ్బంది అప్రమత్తమై తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లాకు చెందిన రవికుమార్‌ను అరెస్ట్ చేసి, 8 ఎర్ర చందనం దుంగలను, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితుడ్ని కోర్టుకు హాజరు పరిచినట్లు సిఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందిని అభినందించారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, స్కార్పియో

రాజీ మార్గంలో కేసులు పరిష్కారం


కేసుల పరిష్కారంలో జడ్జి బాబా ఫక్రుద్దీన్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం చూపామని జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి షేక్ బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని జడ్జితోపాటు బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, మురళీధర్‌రెడ్డి, డిఎస్‌పి నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడానికి వచ్చిన వారందరికీ అభినందనలు తెలిపారు. రాజీ మార్గంలో వెళితే పగలు ప్రతీకారాలు పోయి ఒకరిపై ఒకరికి అభిమానం ఏర్పడుతుందన్నారు. మంచి మార్గంలో నడిచేందుకు ఇద్దరూ కలిసి తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. మొత్తం సివిల్, క్రిమినల్, బ్యాంక్, చెక్ బౌన్స్ వంటి అన్ని కేసులు కలిపి 1928 పరిష్కారమయ్యాయని తెలిపారు. వీటికి రివార్డు ఒక కోటి 39 లక్షల, 60 వేల 635 రూపాయలన్నారు. చివరిగా జడ్జి బాబా ఫక్రుద్దీన్ జన్మదినం సందర్భంగా డిఎస్‌పి నాగరాజు, బార్ అసోసియేషన్ న్యాయవాదులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సిఐలు జమ్మలమడుగు అర్బన్ సదాశివయ్య, కొండారెడ్డి, ముద్దనూరు, కొండాపురం సిఐలు, ఎస్ఐలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 200 కేసులు పరిష్కారం

చాపాడు(మైదుకూరు) : మైదుకూరులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 200 కేసులకు పరిష్కారం లభించిందని మండల న్యాయ సేవా సాధికార సంస్థ చైర్మన్, న్యాయమూర్తి ఖాజా మొయిద్దీన్ పేర్కొన్నారు. రాజీ అయ్యేందుకు సముఖత చూపిన వారిని విచారించి పరిష్కారం చూపామన్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కక్షిదారులకు భోజన సౌకర్యం కల్పించారు. వీరికి న్యాయమూర్తి స్వయంగా భోజనం వడ్డించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు రవి శేఖర్, కార్యదర్శి దేవేంద్రకుమార్, న్యాయవాదులు శ్రీనివాసులు, జ్వాలా, నాగిరెడ్డి, రవి పాల్గొన్నారు.

సౌత్‌జోన్ జట్టుకు 'గౌతమి' విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బి.టెక్ మూడో సంవత్సరం చదువుతున్న బి.రోజా జె.ఎన్.టి.యు. అనంతపూర్ విశ్వ విద్యాలయం నిర్వహించిన కబడ్డీ క్రీడలో సౌత్‌జోన్ జట్టుకు ఎంపికైందని ఆ కళాశాల కో-డైరెక్టర్ శైలూష తెలిపారు. ప్రొద్దుటూరు రోడ్డులోని గౌతమి మహిళ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆయన విలేకరులతో మాట్లా డారు. గతంలో రోజా జె.ఎన్.టి.యు. అనంతపూర్ హ్యాండ్ బాల్‌లో ప్రతిభ కనబరచిందన్నారు. అండర్-17 కబడ్డీ రాష్ట్ర స్థాయి ఖేల్ ఇండియా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని ముడవ స్థానంలో నిలిచిందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఓబయ్య తెలిపారు. కళాశాల చైర్మన్ నాగూర్, రవీంద్రారెడ్డి, అకాడమిక్ సలహాదారు డాక్టర్ ఉమాకాంతం, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి అయ్యావారయ్య పాల్గొన్నారు.


రోజాతో కళాశాల యాజమాన్యం నాగూర్


ఇళ్ల నిర్మాణంలో మొదటి స్థానం

ఎర్రగుంట్ల : వైసిపి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ప్రభుత్వ ఇళ్ల నిర్మాణంలో భాగంగా దాదాపు 30 లక్షల మందికి ఇళ్ల స్థలాలను మంజూరు చేసిందని, దేశంలోనే ఎపిది మొదటిస్థానమని జడ్‌పిటిసి బాలయ్య తెలిపారు. తన కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌దేనని తెలిపారు. ఒక్క ఎర్రగుంట్ల మండలంలోనే పేదలకు 2200 పైచిలుకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా దాదాపు 1300 ఇళ్లకు సంబందించిన పనులు పూర్తికాగా, మిగిలిన వాటి పనులు జరుగుతున్నాయన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సూచనల మేరకు సంబంధిత అధికారులు పనులు వేగవంతం చేశారని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో వైసిపి నాయకుడు సత్తార్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకలకు ఎస్‌విడిసి విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

గుజరాత్ రాష్ట్రంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ విశ్వవిద్యాలయంలో జరగనున్న ప్రి రిపబ్లిక్ డే వేడుకలకు శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కాలేజీ విద్యార్థి ఎం.వెంకట సాయికుమార్ ఎంపిక య్యారని కళాశాల ప్రిన్సిపల్ ఆర్కటవేముల హరి నారాయణ పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుకెళుతున్నారని తెలిపారు. కళాశాల ఖ్యాతిని పెంచు తున్నారన్నారు. 2022 అక్టోబర్ 17న యోగి వేమన యూనివర్సిటీలో జరిగిన ఎంపికల్లో వెంకట సాయికుమార్ ప్రతిభ చూపి ఎంపికైనట్లు తెలిపారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీకాంత్ కుమార్‌రెడ్డి, రామ్మోహన్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ గౌరీ శంకర్, సలీం, కృష్ణవేణమ్మ, వెంకట సాయికుమార్ అభినందించారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎమ్మెల్యేకు కడప మేయర్ పరామర్శ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డిని తన నివాసంలో ప్రొద్దుటూరులో శనివారం కడప మేయర్, వైసిపి జిల్లా అధ్యక్షులు సురేష్‌బాబు పరామర్శించారు. ఇటీవల హైదరాబాదులో ఎమ్మెల్యే మోకాలకు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. పరామర్శించిన వారిలో వ్యవసాయ సలహా మండలి జిల్లా అధ్యక్షులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, చాపాడు జడ్‌పిటిసి భర్త శాంతరాజు, రైతు సలహా మండలి సభ్యులు నారాయణరెడ్డి ఉన్నారు.


ఎమ్మెల్యేను పరామర్శిస్తున్న సురేష్‌బాబు

మోడీ పర్యటనలో విభజన హామీల ఊసేలేదు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రధాని నరేంద్రమోడీ విశాఖ పర్యటనలో విభజన హామీలు అమలుపై స్పష్టత ఇవ్వలేదని, మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానికంగా శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని నాడు నినదించి, పోరాడి సాధించుకున్న ఉక్కును అమ్మేస్తున్నారన్నారు. 600 రోజులుగా విశాఖ ఉక్కు పరిరక్షణ వేదిక దీక్షలు చేస్తుంటే బలవంతంగా దీక్షలో ఉన్న వారిని అరెస్టు చేశారన్నారు. మోడీ పర్యటనలో విభజన హామీలు ఒక్కటి అయిన అమలుపై ప్రధాని మాట్లాడుతారని అనుకున్నామని కానీ సెల్ఫ్ పబ్లిసిటీ తప్ప రాష్ట్రానికి ఒరిగిందేమీలేదన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్‌రాజ్, బాషా, వెంకటేష్, సుబ్బారావు పాల్గొన్నారు.

వెండి కాసుల దండ వితరణ

ప్రజాశక్తి - వేంపల్లె

శ్రీలక్ష్మీ వృషభా చలేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన ఎద్దుల కొండ్రాయుడికి కిలో 370 గ్రాముల వెండి కాసుల దండను హేమంత్ వితరణ చేశారు. శ్రీవేంకటేశ్వర ఆలయంలో శనివారం సత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన సవరాల హేమంత్ తన పెద్ద నాన్నయివి నారాయణప్ప ధర్మపత్ని పార్వతమ్మ జ్ఞాపకార్థం వెండి కాసుల దండను ఆలయ ఇఒ శ్రీధర్, దేవస్థానం చైర్మన్ వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ దాతల సహకారం మరవలేమన్నారు. సహకారంతో ఆలయ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. అనంతరం దాతలకు వేద పండితుడు హరి ప్రవీణ్ ప్రత్యేక పూజలు చేసి చిరు సత్కారం చేసి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు అరవింద్, సిద్దారెడ్డి, జూనియర్ అసిస్టెంట్ దాసిరెడ్డి, దాత కుటుంబ సభ్యులు మల్లమ్మ, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఇఒకు వెండి కాసుల దండను అందజేస్తున్న దాతలు

విగ్రహం మార్పునకు జిల్లా రచయితల సంఘం మద్దతు

ప్రజాశక్తి - చాపాడు

వైవియూలో వేమన విగ్రహం మార్పునకు జిల్లా రచయితల సంఘం సంపూర్ణ మద్దతు పలుకుతోందని జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా వెంకటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో భాగంగా ఉన్న కడప పిజి సెంటర్‌ను 2006లో డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి కృషితో యోగి వేమన విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిందన్నారు. ఉమ్మడి కడప జిల్లా గ్రామీణ విద్యార్థులకు వరప్రదాయినిగా నిలిచిందన్నారు. ప్రస్తుతం న్యాక్ గుర్తింపులో భాగంగా విద్యాలయాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగానే లోపల మరుగున ఉన్న యోగి వేమన శిలా విగ్రహాన్ని ముఖద్వారం చెంత గౌరవప్రదంగా నిలపడం శుభపరిణామమన్నారు. కేవలం విద్యార్థులకు మాత్రమే కాకుండా దారిన వెళ్లే ప్రతి ఒక్కరికి యోగివేమన విశిష్టతను తెలిపేలా విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఇది నిజంగా యోగి వేమనకు దక్కిన గొప్ప గౌరవంగా భావించాలన్నారు.

అభివృద్ధికి శ్రీకారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో అభివృద్ధికి శ్రీకారం చుట్టామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం మాట తప్పడం వల్ల అభివృద్ధి జరగలేదని, చంద్రబాబు పాలనలోని 14 సంవత్సరాలు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధికి రూ.వేల కోట్లు వెచ్చించారన్నారు. 24వేల మంది పేదల సొంతింటి కళను సాకారం చేసేందుకు రూ.వెయ్యి కోట్లు వెచ్చించామన్నారు. 87శాతం మందికి సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. దళారీ వ్యవస్థ లేకుండా నేరుగా లబ్ధిదారులకు రూ.వెయ్యి కోట్లు సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. కూరగాయల మార్కెట్, బస్టాండు ఆధునీకరణ, మంచినీటి సమస్య పరిష్కారానికి, విద్యారంగానికి, గ్రామీణ ప్రాంతాలకు మరో రూ.వెయ్యి కోట్లు.. మొత్తం నియోజకవర్గానికి రూ.3000 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి గతంలోని అన్ని ప్రభుత్వాలు కలిపి రూ.500 కోట్లు ఖర్చుచేయలేదన్నారు. ఈనెల 15న కూరగాయల మార్కెట్ ఆధునీరణకు భూమిపూజ నిర్వహిస్తున్నామని తెలిపారు. మంచినీటి సమస్య పరిష్కారానికి 90శాతం పనులు పూర్తి అయ్యాయని డిశంబర్ 21న ముఖ్యమంత్రి జగన్ ఈ పథకాన్ని ప్రారంభిస్తామన్నారు.

ఎన్‌సిసికి 26 మంది ఎంపిక

జమ్మలమడుగు రూరల్ : సాయి పరమేశ్వర డిగ్రీ కళాశాలలో ఈ ఏడాదికిగాను 26 మంది ఎన్‌సిసికి ఎంపికయ్యారని ఆ కళాశాల కరస్పాండెంట్ పాలా నాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం స్థానిక పి.ఆర్ హైస్కూల్ మైదానంలో ఈ ఎంపికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ విభార్ గుప్తా ఆదేశాల మేరకు వివిధ రకాల దేహదారుఢ్య పరీక్షలు, రాత పరీక్షలు నిర్వహించామన్నారు. ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ పి.రాజు మాట్లాడుతూ ఎన్‌సిసి కళాశాల విద్యార్థులు అనేక మంది జాతీయ స్థాయి క్యాంపులకు సెలెక్ట్ అయ్యారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు, ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

త్రీ వీలర్ స్కూటీలకు దరఖాస్తు చేసుకోండి

పులివెందుల రూరల్ : ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా అందించే మూడు చక్రాల స్కూటీలకు అర్హులైనవారు ఈనెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9247339815, 9100985848 నంబర్లను సంప్రదించవచ్చునని రఘునాథరెడ్డి కోరారు.

www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 13 నవంబర్ 2022
5
అన్నమయ్య



పాఠశాలల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

రాయచోటి టౌన్ : విద్యార్థుల స్వేచ్ఛను హరింపచేస్తూ, రాష్ట్ర విద్యాశాఖ నిర్ణయాన్ని సైతం ఉల్లంఘించిన పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని యాజమాన్యలపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ నిబంధనలు భేఖాతారు చేస్తూ తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహించడం సరికాదన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలు నడుస్తున్నాయని పేర్కొన్నారు. రెండవ శనివారం కూడా విద్యార్థులకు స్వేచ్ఛని ఇవ్వకుండా తరగతులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. జోరు వర్షంలో సైతం విద్యార్థుల స్వేచ్ఛను హరింప చేస్తున్నారని చెప్పారు. అనేకసార్లు ఆధారాలతో సహ ఫిర్యాదు చేసినా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని వాపోయారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి ఆయా పాఠశాల పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

వరి నూర్పిడి ప్రారంభం

పంట పొలాల్లోనే అమ్మకాలు

జాడ కన్పించని కొనుగోలు కేంద్రాలు



ప్రజాశక్తి - చాపాడు

కుందూ, పెన్నా తీర గ్రామాల్లో ఖరీఫ్ లో సాగు చేసిన వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయి. గత ఏడాది కంటే ఈ ఏడాది దిగుబడి కాస్త ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. ధరలు మాత్రం నామమాత్రంగా ఉన్నాయని వాపోతున్నారు. పండిన వరి ధాన్యాన్ని నిల్వ ఉంచుకొని ధరలు వచ్చినప్పుడు అమ్మకాలు సాగించేలా వసతి లేకపోవడంతో పంట పొలాలలోనే అమ్మకాలు సాగించాల్సి వస్తుందని చెబుతున్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని రకాల సౌకర్యాలు, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ప్రకటించారు. అందుకు అనుగుణంగా రైతుల అంచనా మేరకు కాకపోయినా గత ప్రభుత్వం కంటే కొంత మేరకు వరి పంటకు గిట్టుబాటును అందించారు. సాధారణ వరి వంగడాలకు బస్తాకు(75 కిలోలు) రూ.1461, ఏ గ్రేడ్ రకానికి బస్తా రూ.1476 లకు గిట్టుబాటు ధర ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా వరి ధాన్యాన్ని కొనుగోలు చేశారు. అయితే ఈ ఏడాది వరి నూర్పిడి పనులు ప్రారంభమైనా ఏమాత్రం రైతులకు భరోసాగా నిలవడం లేదని తెలుస్తోంది. జిల్లాలో కేసి కెనాల్, కుందూ,పెన్నా నదులు, తెలుగుగంగా, మైలవరం, పైడిపాలెం, చిత్రావతి , గండికోట రిజర్వాయర్ల పరిధిలో 1.10 లక్షల ఎకరాలకు పైగా రైతులు వరి పంటను ఖరీఫ్ సీజన్‌లో సాగు చేశారు. అధికంగా చాపాడు ,దువ్వూరు, మైదుకూరు మండలాల పరిధిలో కెసి కాలువ కింద 35 వేల ఎకరాలలో వరి పంట సాగైంది. ప్రస్తుతం పంట నూర్పిడి పనులు కుందూ,పెన్నా తీరంలో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది వరి పంట దిగుబడి గత ఏడాది కంటే పెరిగిందని రైతులు పేర్కొంటున్నారు. 32 నుంచి 36 బస్తాల వరకు దిగుబడి వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం వరి ధాన్యాన్ని నిల్వ ఉంచుకునే వసతులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పంట పొలాలలోనే అమ్మకాలు చేపడుతున్నారు. పుట్టి (600 కిలోలు) జిలకర రకం రూ. 11వేలు పలుకుతున్నాయి. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర కన్నా రూ. 1000 తక్కువకు దళారులు కొనుగోలు చేస్తు న్నారు. దీంతో రైతులకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదు.కొనుగోలు కేంద్రాల్లో అమ్మకాలు చేపడతామనుకుంటే ఎక్కడ అందుబాటులో లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు అమలు కావడానికి అలస్యం కావడంతో పంటను పొలాల్లోనే దళారులకు అప్పగిస్తున్నారు. గ్రామాలలో కొనుగోలు కేంద్రాలపై అవగాహన కూడా సరిగా లేదు. 2010లో ప్రభుత్వం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో డిసిఎంఎస్ ద్వారా జిల్లా వ్యాప్తంగా 11 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 4 లక్షల బస్తాల వరి ధాన్యాన్ని సేకరించారు .2021లో సచి వాలయాల పరిధిలో కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఇంకా నిబంధనలు అందలేదని తెలు స్తోంది. చాపాడు మండలంలో రోజూ వందలు బస్తాల దాన్యం ఇతర ప్రాంతాలకు తరలిపోతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం మండల కేంద్రాలలో కొను గోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు గిట్టు బాటు ధర కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది .

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో దళారులు నిర్ణయించిన ధరకు ధాన్యాన్ని విక్రయిస్తున్నాం. ప్రభుత్వం చర్యలు చేపట్టి దళారులు కూడా గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం వర్షాలకు ధాన్యం తడుస్తుందని దళారులు నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేపడుతున్నాం. ప్రభుత్వం కొనుగోలుకు శ్రీకారం చుట్టాలి.

-వి.వీరారెడ్డి,అయ్యవారిపల్లె, చాపాడు.

దళారులు లాభపడుతున్నారు



ఆరుగాలం కష్టపడి, పెట్టుబడులు పెట్టిన రైతుల కంటే చివరి నిమిషంలో కొనుగోలు కోసం వచ్చే దళారులు అధికంగా లాభపడుతున్నారు. ఈ ఏడాది 3 ఎకరాల్లో సాగు చేసిన వరి వర్షానికి నేలకొరిగి దిగుబడి తగ్గింది. దళారులు రోజుకు ఒక రేటు నిర్ణయిస్తూ వారు సూచించిన ధకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి చేసి గిట్టుబాటు ధర కల్పించాలి. రైతులకు ఉపయోగం ఉండేలా కొనుగోలు చేపట్టాలి.

- వెంకట రమణ, అయ్యవారిపల్లె, చాపాడు

అక్రమ అరెస్టులు దుర్మార్గం : సిపిఎం



గాంధీ విగ్రహం వద్ద నిరసన చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు రూరల్

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశాఖపట్నం సందర్భంగా అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.హెచ్.చంద్రశేఖర్ అన్నారు. శనివారం అక్రమ అరెస్టులకు నిరసనగా శనివారం గాంధీ విగ్రహం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్రానికి వచ్చిన నరేంద్ర మోడీ రాజధాని నిర్మాణానికి, చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చి రాష్ట్ర ప్రజల్ని అవమానించారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, ప్రాణ త్యాగంతో నిర్మించుకున్న ఉక్కు పరిశ్రమను ఆదానీలకు అప్పజెప్పడానికి మోడీ వస్తున్నారని విమర్శించారు. కడపలో ఉక్కు పరిశ్రమ నిర్మించడంలో కాలయాపన చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పందికాళ్ళ మణి, నాయకులు మండల కన్వీనర్ లింగాల యానాదయ్య, కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సిఐటియు మండల కన్వీనర్ దాసరి జయచంద్ర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి పి.జాన్ ప్రసాద్, ఓబులవారిపల్లి సిఐటియు మండల కన్వీనర్, దార్ల సుధాకర్, మంగంపేట త్రివేణి కంపెనీ సిఐటియు నాయకులు, ముత్యాల శ్రీనివాసులు, శివ, ఆటో యూనియన్ నాయకులు, రమణయ్య, నాగరాజు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు, కేశవులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు, అంకెపల్లి చంగయ్య. వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్, బొజ్జ శివయ్య, గిరిజన సంఘ నాయకులు, చలపతి పాల్గొన్నారు.

సిఐటియు జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

కరపత్రాలను ఆవిష్కరించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సిఐటియు జిల్లా 9వ మహాసభలు డిసెంబర్ 29, 30 తేదీలలో నగరంలో నిర్వహిస్తున్నామని, ప్రతి కార్మికుడూ పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. మనోహర్ తెలిపారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గ సమస్యల పరిష్కారం కోసం సిఐ టియు నిరంతరం కష్టజీవులు, శ్రమజీవుల పక్షాన అహర్నిశలు పనిచేస్తూ ఉద్య మాలే ఊపిరిగా పనిచేస్తున్న సంఘం సిఐటియు అని తెలిపారు. ఇవాళ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లోపభూయిష్ట విధానాల ఫలితంగా కార్మిక వర్గం పై పెద్ద ఎత్తున దాడి చేస్తున్నాయని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని విధానం నుంచి 12 గంటల పని విధానం వరకు పెంచారని, దీని ద్వారా కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. అసంఘటితరంగా కార్మికులకు పని భద్రత, ఉద్యోగ భద్రత కల్పించాలని చెప్పారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక సారి నిర్వహించే ఈ మహాసభలలో కార్మిక వర్గం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చర్చించి భవిష్యత్ కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకు వెళదామని తెలిపారు. అనంతరం జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని తెలిపారు. మహాసభల సందర్భంగా కడప నగరంలో పెద్ద ఎత్తున ర్యాలీ, ప్రదర్శన బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎమ్మెల్యే ఎం.ఎ. గఫూర్, సిఐటియు రాష్ట్ర కార్య దర్శి ఎం. బాల కాశి తో పాటు జిల్లా ముఖ్యమైన నాయకత్వం పాల్గొంటుందని తెలి పారు. మహాసభలను జిల్లా కార్మిక వర్గ సోదరులు, ప్రజాతంత్ర మేధావులు, మహా సభ జయప్రదం కోసం సహాయ సహకారాలు అందించాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కె. శ్రీనివాసులు రెడ్డి, అంగ న్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బి. లక్ష్మీదేవి పాల్గొన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న విసి సూర్య కళావతి

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిప్లమో ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విసి మునగల సూర్య కళావతి శనివారం విడుదల చేశారు. విసి ఛాంబర్‌లో కుల సచివులు ఆచార్య దుర్భాక విజయ రాఘవ ప్రసాద్, ప్రిన్సిపల్ కె.కృష్ణా రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎన్. ఈశ్వర రెడ్డి, పాలకమండలి సభ్యులు డాక్టర్ వైపి వెంకటసుబ్బయ్య, కాలేజ్ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ డాక్టర్ సుబ్బరాయుడుతో కలిసి పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. అనంతరం విసి మాట్లాడుతూ అక్టోబర్‌లో నిర్వహించిన డిపిఇడి పరీక్షలకు 84 మంది విద్యార్థులు హాజరవ్వగా అందరూ ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. బిపిఇడి నాలుగో సెమిస్టర్ పరీక్షకు 81 మంది విద్యార్థులు రాయగా 78 మంది ఉత్తీర్ణులయ్యాయని పేర్కొనాన్రు. 96.3శాతం ఫలితాలు వచ్చాయన్నారు. సందర్భంగా పరీక్షల విభాగాన్ని అభినందించారు. కార్యక్రమంలో పరీక్షల విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -కలకడ

గ్రంథాలయ వారోత్సవాలను ఈ నెల 14వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి అమరనాథ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన శాఖ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభోత్సవం, 15న పుస్తకాల ప్రదర్శన, 16వ తేదీన గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల నాయకుల స్మరించుట, 17వ తేదీన కవి సమ్మేళనాలు, సెమినార్లు, 18వ తేదీన పాఠశాల విద్యార్థులకు విదంశాలపై పోటీలు నిర్వహించుట, 19వ తేదీన మహిళా దినోత్సవ సందర్భంగా దిశా చట్టం, మహిళా సాధికారతపై చర్చ, 20వ తేదీన డిజిటల్ గ్రంథాలపై అవగాహన, ముగింపు కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయ వారోత్సవాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పీలేరు: 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు పీలేరు శాఖా గ్రంథాలయ అధికారి విజయకుమార్ తెలిపారు. వారోత్సవాల ప్రారంభోత్సవానికి స్థానిక ప్రముఖ నాయకులు, ప్రభుత్వ అధికారులను ఆహ్వానించామన్నారు. పీలేరు పట్టణ సిఐ ఎం.మోహన్‌రెడ్డి, ఎస్ఐ ఎం.కె.నరసింహుడు గ్రంథాలయ అధికారి విజయకుమార్ 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు.



పీలేరు : వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిఐ, ఎస్ఐ

'ఉరుసు' విజయవంతానికి సహకరించండి : కలెక్టర్



పెద్దదుర్గా ఉరుసు ఉత్సవ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

డిసెంబర్ నెల 6 నుంచి 12 వరకు నిర్వహించబోయే అమీర్‌పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలను జిల్లా అధికారులు, దర్గా కమిటీ సభ్యులు సమన్వయంతో విజయవంతం చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాల్‌లో అమీన్ పీర్ దర్గా ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులు, దర్గా కమిటీ సభ్యులతో అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి జనాబ్ ఆరిఫ్ ఉల్లా హుసేనితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్‌పి అన్బురాజన్, జెసి సాయికాంత్‌వర్మ, కమిషనర్ సూర్యసాయిప్రవీణ్‌చంద్, డిఆర్ఒ గంగాధర్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో కోవిడ్ వల్ల ఉరుసు ఉత్సవాలను పరిమిత సంఖ్యలో నిర్వహిం చుకున్నామని పేర్కొన్నారు. ఉరుసు ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహిం చడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. తరతరాలుగా సర్వమతాల సంస్కృతికి ప్రతీకగా వెలుగొందుతూ, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అమీన్ పీర్ దర్గా ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా. కలిసికట్టుగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తిచేసి విజయవంతం చేయాలన్నారు. యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శానిటేషన్ కార్యక్రమాలను చేపట్టాలని నగర పాలక సంస్థ కమిషనర్‌ను ఆదేశించారు. సురక్షితమైన తాగునీరు , హై మాస్ లైట్లు, మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఉరుసు మహోత్సవాలు సమయంలో ఆయా పరిసరాల్లో క్రమం తప్పకుండా సోడియం హైపోక్లోరైడ్, బ్లీచింగ్ పౌడర్ చల్లించే ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి సంఘటనలకు తావివ్వకుండా కట్టుదిట్టమైన గట్టి బందోబస్తు, నిర్దేశించిన ప్రధాన ప్రాంతాల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్‌పికి సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అదనపు భద్రతా సిబ్బంది తో పాటు ,మహిళా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచఒ డా.నాగరాజుకు చెప్పారు. 108 , 104 అంబులెన్స్ , అత్యవసర మందులను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ ఏర్పాట్లలో షార్ట్ సర్క్యూట్ అవ్వకుండా, నిరంతరం విద్యుత్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా ఫైర్ ట్యాంక్‌లను అందుబాటులో ఉంచుకోవాలని ఫైర్ శాఖ అధికారులను ఆదేశించారు. రాష్ట్రం నుంచే కాక దేశ, విదేశాలనుంచి కూడా యాత్రికులు ఈ ఉరుసు ఉత్సవాలకు వస్తుంటారని వారికి ఇబ్బందులు కలుగకుండా అవసరమైనన్ని ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ , రైల్వేస్టేషన్ నుంచి దర్గా వరకు బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. ఆటో వారితో మాట్లాడి వివిధ పాయింట్ల నుంచి దర్గా వరకు ధరలను ఫిక్స్ చేయాలని డిటిసికి సూచించారు. కార్యక్రమంలో డిఇఒ దేవరాజ్, జిల్లా మైనారిటీ సంక్షమ శాఖ అధికారి కృష్ణకిషోర్, దర్గా కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- బాస్కెట్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి



స్కూల్ గేమ్స్ అండర్-17 బాస్కెట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాస్కెట్ బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సిఎస్‌ఆర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్-17 బాస్కెట్ బాల్ బాలబాలికల జిల్లా జట్టును శనివారం ఎంపిక చేశారు. బాలురు జట్టులో వాల్మీకిపురం పివిసి ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ప్రవీణ్, వరున్‌తేజ్, అరవింద్, జబీరుల్లా, స్వతంత్ర భారతి స్కూల్ నుంచి దివాకర్, వివేకానంద స్కూల్ నుంచి క్రిష్ణ కౌశిక్, చిత్తూరు నుంచి సి.కె హేమ చరణ్, వశీం అక్రం, చేతన్, మదనపల్లి నుంచి అఫ్నన్, రెడ్డి శ్రీకర్, చరణ్ తేజ్, స్టాండ్‌బైస్‌గా భానుతేజ, నందీష్ రెడ్డి, హరూన్ బాషాలు ఎంపికయ్యారు. జిల్లా బాలికల జట్టులో పివిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రెడ్డిగాయత్రి, మమత, చిత్తూరు నుంచి హర్షిణి చౌదరి, గీతిక సాగర్, తనుశ్రీ, మదనపల్లి నుంచి రూపరెడ్డి, సింధు, సుప్రియ, తరిగొండ నుంచి అంజలి, తనుజ, పూజిత, ఈడిగపల్లి నుంచి షాలిని, స్టాండ్‌బైస్‌గా మదనపల్లి నుంచి ప్రణిక, అమృతలు ఎంపికయ్యారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగనున్న స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం చింతల శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆటల పోటీల్లో పాల్గొనడం వలన ఉల్లాసం, ఉత్సాహం లభిస్తాయని, శరీర ధృడత్వం పటిష్టంగా ఉంటుందని తెలిపారు. క్రీడల్లో పాల్గొని, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తే మంచి భవిష్యత్తుతో పాటు మంచి ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి పీడీ రామ, పిఇటి, పీడీలు సుబ్రమణ్యం, మునుస్వామి, మాండవ్య, జయక్రిష్టి, నాగరాజు, మధుబాబురెడ్డి, గోపి, రమేష్, సీనియర్ క్రీడాకారులు సాయిభార్గవ్, రవి పాల్గొన్నారు.



వర్షపు నీటితో మడుగును తలపిస్తున్న బస్టాండ్

మడుగును తలపిస్తున్న బస్టాండ్

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని గేటు నుంచి బస్టాండ్ వరకు నాలుగు లైన్ల సిసి రోడ్డును నిర్మిస్తున్నారు. మరో వైపు మురుగు కాల్వలను ఏర్పాటు చేస్తున్నారు. కానీ వర్షపునీరు మురుగు కాల్వలో వెళ్లకుండా రోడ్డుపై ప్రవహిస్తూ బస్టాండ్ గేటు వద్ద నిల్వ ఉంటోంది. ప్రయాణికులు బస్టాండుకు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు. శనివారం కురిసిన వర్షానికి బస్టాండ్ ఆవరణమంతా మడుగును తలపించేలా వర్షపు నీరు నిల్వ ఉంది. కాల్వలు ఏర్పాటు చేసినా అక్కడక్కడే నీరు వెళ్లేందుకు రంధ్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రోడ్డుపై వర్షపు నీరు నిల్వ ఉంటోంది. పోలీస్‌స్టేషన్, పెట్రోల్ బంకు వరకు 135 మీటర్ల మురుగు కాల్వను నిర్మించినా ప్రయోజనం లేకుండా పోయింది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలున్నాయి. వర్షపు నీటిలో దుకాణాలకు వెళ్లాలన్నా ప్రజలకు ఫీట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి రోడ్డుపై నిల్వ ఉన్న వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజీ మార్గమే రాజమార్గం : జడ్జి శారద



లక్కిరెడ్డిపల్లె : లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సివిల్ జడ్జి డాక్టర్ శారద

ప్రజాశక్తి-లకిరెడ్డిపల్లి

రాజీ మార్గమే రాజ మార్గమని సివిల్ జడ్జి డాక్టర్ శారద పేర్కొన్నారు. శనివారం సివిల్ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. క్రిమినల్, సివిల్ కేసులకు సంబంధించి 218 కేసులకు గాను రూ.2,16,850 నగదును రికవరీ చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్, కోర్టు చుట్టూ తిరగకూడదని తెలిపారు. క్షణకావేశంలో జరిగే తప్పులను సర్దుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్. రామచంద్రారెడ్డి, చెన్న కృష్ణయ్య, రెడ్డన్న, బాలాజీరెడ్డి, ఎస్ఐ వినోద్ కుమార్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

411 కేసులకు శాశ్వత పరిష్కారం

నందలూరు: జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌కు భారీ స్పందన లభించినట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.లత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 411 కేసులకు శాశ్వత పరిష్కారం లభించిందని తెలిపారు. సివిల్ కేసులో రూ.11,39,992, క్రిమినల్ కేసులో రూ.3,78,800, పిఎల్‌సి కేసులో రూ.2,30,000 నగదును ఫిర్యాదుదారులకు ఇప్పించామని పేర్కొన్నారు. ఇతర క్రిమినల్ కేసులులో రూ.47,060 ప్రభుత్వానికి జమ చేయడమైనదన్నారు. ఈ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, నందలూరు, పెనుగులూరు, పుల్లంపేటకు సంబంధించి సిఐ, ఎస్ఐలు, కోర్టు కానిస్టేబుల్స్, పిఎల్‌విఎస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్: జాతీయ లోక్ అదాలత్‌లో 1410 కేసులు పరిష్కరించి, బాధితులకు రూ.7,48,18,621 పరిహారంగా అందజేసినట్లు న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోటార్ యాక్సిడెంట్, క్రిమినల్, సివిల్, చెక్ బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ తదితర కేసులలో కక్షిదారులు రాజీ కుదిర్చి బాధితులకు పరిహారంతో పాటు కేసులను పరిష్కరించామని తెలిపారు.

విద్యార్థులు యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఆచార్య దేవప్రసాద్‌రాజు

ప్రజాశక్తి-వాల్మీకిపురం

విద్యార్థులు సైన్స్‌ను బాగా అధ్యాయనం చేసి యువ శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎస్‌వి యూనివర్శిటీ భౌతికశాస్త్ర విభాగం ఆచార్య దేవప్రసాద్ రాజు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ బెంగళూరు, ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమి న్యూఢిల్లీ, ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్ ప్రయాగ్ రాజ్ సంస్థల సంయుక్త సౌజన్యంతో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఫంక్షనల్ మెటిరియల్స్ అనే అంశంపై విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆచార్య దేవప్రసాద్ రాజు మాట్లాడుతూ దేశానికి యువ శాస్త్రవేత్తల అవసరం ఎంతో ఉందని, విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాప్‌లను ఉపయోగించుకొని శాస్త్రాధ్యయనం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫండమెంటల్స్ అండ్ అప్లికేషన్స్ ఆఫ్ స్పెక్ట్రోస్కోపిక్ టెక్నిక్స్ ఇన్ మెటీరియల్ క్యారెక్టరైజేషన్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ గ్లాసెస్ 2022, నానో టెక్నాలజీ ఎ బూన్ టు ఎనర్జీ స్టోరేజ్ డివైసెస్ అనే అంశాలపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు ప్రొఫెసర్ జయశంకర్, కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.శ్రీనివాసులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శిశు మరణాలకు న్యుమోనియానే కారణం

- డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్

ప్రజాశక్తి-కలికిరి

శిశు మరణాలకు న్యుమోనియానే కారణమని డిపిఎంఒ డాక్టర్ లోకవర్ధన్ తెలిపారు. శనివారం 'ప్రపంచ న్యుమోనియా దినోత్సవం' సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో పత్తేగడ పంచాయతీ పరిధిలోని పాలెం గ్రామంలో ఆయన ప్రపంచ న్యుమోనియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యుమోనియా వ్యాధి ఐదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు పైబడిన వారిలో వస్తుందన్నారు. న్యుమోనియా ఊపిరితిత్తులలో అసాధారణ ద్రవంగా చేరి నెమ్ము చేరడం, పిల్లలలో శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండటం, జ్వరం, దగ్గు, దొక్కలు ఎగురేయడం, ఆహారం, పాలు లాంటి ద్రవాలు తీసుకోలేక పోవడం, గురక రావడం, ఆయాసం వంటి లక్షణాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ వ్యాధి ఒకరి నుండి మరొకరికి దగ్గినపుడు, తుమ్మినపుడు వెలువడే తుంపర్ల వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న వైద్య ఆరోగ్య సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ మాట్లాడుతూ న్యుమోనియా నివారణ మన చేతుల్లోనే ఉందని చేతుల పరిశుభ్రత లోని దశలను చేసి చూపించారు. అనంతరం ప్రపంచ న్యుమోనియా దినోత్సవం ర్యాలీలో అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. పాలెం గ్రామంలో డాక్టర్ వై.ఎస్.ఆర్.ఆరోగ్య శ్రీలో చికిత్స పొంది డిశ్చార్జి ఐన చిన్నారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో మెడికుర్తి పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ కావ్య, 104 వైద్యులు డాక్టర్ అహమ్మద్, 104 సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పి, చందు ప్రియ, ఎఎన్ఎం పార్వతి, ఆశా కార్యకర్తలు చంద్రమ్మ, ఆది లక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్త గంగులమ్మ పాల్గొన్నారు. **పీలేరు:** బాల్యం ఆరోగ్యంగా ఉండాలంటే శిశువుకు సంభవించే అసాధరణ ఆరోగ్య సమస్యలను గుర్తించే నైపుణ్యం ప్రతి తల్లికి అవసరమని డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. శనివారం మోడల్ కాలనీలో నిర్వహించిన గ్రామీణ కుటుంబ ఆరోగ్య సేవలు కార్యక్రమంలో భాగంగా ప్రపంచ న్యుమోనియా వ్యాధి దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ తల్లులకు న్యుమోనియా వ్యాధి, లక్షణాలు, తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కుసుమ, సిహెచ్‌ఓ అయేషా, ఏఎన్ఎం లక్ష్మీ, వెంకట రత్నం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



శిశు మరణాలపై తల్లులకు సూచిస్తున్న డాక్టర్ లోకవర్ధన్

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



బాధితులతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గత ఏడాది నవంబర్‌లో జవాద్ తుఫాను కారణంగా అన్నమయ్య డ్యామ్ తెగిపోయి సంభవించిన వరదలో సమస్తం కోల్పోయిన ప్రజలను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జనసేన నాయకులు పేర్కొన్నారు. శనివారం జనసేన నాయకులు వరద ప్రభావిత ప్రాంతమైన పులపుత్తూరులో పర్యటించారు. ఏడాదిగా బాధితులకు ప్రభుత్వం అందజేసిన సాయాన్ని గురించి ఆరా తీశారు. బాధితులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా జనసేన పార్టీ తరపున పోరాడతామని ప్రజలకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరద బాధిత ప్రజల కష్టాలు చూస్తే కన్నీరు ఆగటం లేదన్నారు. మూడు నెలల్లో కోల్పోయిన ఇళ్ల స్థానంలో సురక్షితమైన ప్రాంతంలో ఇళ్లు కట్టించి తాళాలు చేతులో పెడతామన్న ముఖ్యమంత్రి హామీలు నీటిమూటలేనని పేర్కొన్నారు. ఏడాదిగా పునరావాసంలో ఇళ్లు పునాదుల స్థాయిలోనే ఉన్నాయని, అప్పులు చేసి పునాదులు నిర్మించుకున్న ప్రజలకు నేటికీ బిల్లులు మంజూరు కాలేదని తెలిపారు. ఎండకు, వానకు, చలికి ప్రజలు చిన్న చిన్న గుడారాలలో పాములు, తేళ్లు, దోమల మధ్య జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రక్షణ గోడ నిర్మాణం ఊసే లేదన్నారు. పొలాల్లోని ఇసుక మేటలు తొలగించకపోవడంతో వ్యవసాయమే ప్రధాన జీవనాధారమైన ఆ ప్రాంత ప్రజలకు జీవనాధారం లేకుండా పోయినా వారి కష్టాలకు, కన్నీళ్ళకు జగన్మోహన్‌రెడ్డి గుండె కరగలేదని అన్నారు. దయనీయ స్థితిలో వరద బాధిత ప్రజలు కొట్టుమిట్టాడుతుంటే పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని వాపోయారు. జనసేనాని పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు జగనన్న మోసం అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు నిజానిజాలు తెలియజేయడంతో పాటు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, జిల్లా లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, వీర మహిళ జెడ్డా శిరీష, భాస్కర్ పంతులు, వీరయ్య ఆచారి, బాల సాయి, శంకరయ్య, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాలికల ఉన్నత పాఠశాల వద్ద వేసిన చెత్త

చెత్త కుండీలు ఏర్పాటు చేయరూ...!

ప్రజాశక్తి-గాలివీడు

చెత్త కుండీలను ఏర్పాటు చేసి పారిశుధ్య చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధాన రహదారుల్లో చెత్త ఎక్కడి పడతే అక్కడ దర్శనమిస్తోంది. పంచాయతీ సిబ్బంది రోజూ ఉదయం రోడ్డుపై చెత్తను తొలగిస్తున్నారు. తరువాత కొద్ది సేపటికి యథాతథంగా మళ్లీ రోడ్డుపై చెత్త చెదారం ఉంటోంది. బాలికల, బాలుర ఉన్నత పాఠశాలలల వద్ద చెత్తను శుభ్రం చేయకపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి దుర్గంధాన్ని తలపిస్తోంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 17 పంచాయతీల్లో మేజర్ పంచాయతీ అయిన గాలివీడులో చెత్తను ట్రాక్టర్ ద్వారా చెత్తను తీసుకెళ్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అలాగే వదిలేయడంతో చెత్తాచెదారం పేరుకుపోయి అధ్వానంగా మారుతున్నాయి. పెద్దూరు కస్బాలోని ఉర్దూ పాఠశాల వద్ద చెత్తకుండీలు ఏర్పాటు చేస్తే దుర్గంధం బాధను తప్పించిన వారవుతారని స్థానికులు పేర్కొంటున్నారు.

బురదమయంగా గ్రామీణ రోడ్లు

ప్రజాశక్తి-రామాపురం

రెండు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని రోడ్లు బురదమయంగా మారాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లాలన్నా, పాదచారులు నడవాలన్న చాలా అధ్వానంగా మారాయి. ముందే గ్రామీణ ప్రాంతాల రోడ్లు కంకరలేసి గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలకు నీరు చేయడంతో వాహనాల్లో వెళ్లాలన్న చాలా ఇబ్బంది ప్రజలు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదని ప్రజలు వాపోతున్నారు ముఖ్యంగా మండలంలోని దర్గా రోడ్డు నుంచి నీలకంఠరావుపేట రోడ్డు, అగ్రహారం నుంచి మూలపల్లి రోడ్డు, సరస్వతి పల్లె రోడ్డు, మన్నేరువాండ్లపల్లి, సురకవాండ్లపల్లి, సుద్దమల్ల బయ్యా రెడ్డి గారి పల్లి, రోడ్డు ఓబుల్ రెడ్డిగారిపల్లి, సుగాలి బిడికి, హసనాపురం, గంగనేరురోడ్డు, బీదవాళ్లపల్లి, దూదేకుల పల్లె, కుమ్మరపల్లి, లక్కిరెడ్డిపల్లి రోడ్డు రాచపల్లి రోడ్డు అధ్వానంగా మారాయి. వర్షం బాగా కురిస్తే రోడ్లు మరింత దారుణ స్థితికి చేరతాయని ప్రజలు వాపోతున్నారు. కంపచెట్లు పొదలు విపరీతంగా పెరిగి రోడ్లు మూసుకుపోతున్నాయని, రాత్రుల్లు ద్విచక్రవాహన దారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని రాయవరం గ్రామానికి చెందిన మండల ఉపాధ్యక్షురాలు కదిరిసేని రెడ్డమ్మ పేర్కొన్నారు. శనివారం ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ తన సొంత నిధులతో తాగునీరు, కనీస వసతులు చేకూర్చామని చెప్పారు. పండగలు, ఇతర శుభ రోజుల్లో పేదలకు అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. బీసీల సమస్యలను ఎప్పటికప్పుడూ పరిష్కరిస్తున్నానని తెలిపారు. వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులను తొలగించామని చెప్పారు. వృద్ధులకు, వితంతువులకు , వికలాంగులకు పింఛన్లు మంజూరు చేయించామన్నారు. ఇళ్లులేని వారి పక్కాగృహాలు, ఇతర పథకాలు మంజూరు చేయించామని తెలిపారు. ప్రజా సేవ చేయడానికి తన వంతుగా కృషి చేస్తానని ఆమె అన్నారు.

బ్యాటింగ్‌లో రాణించిన శ్రీధర్

ప్రజాశక్తి - కడప

కడప జట్టుకు చెందిన జి.శ్రీధర్ బ్యాటింగ్‌లో అబ్బుతంగా రాణించడంతో హైదరాబాదు జట్టుపై కడప జట్టు 9 వికెట్ల తేడాతో తొలి మ్యాచ్ ఘన విజయం సాధించింది. హైదరాబాదులో శనివారం ప్రారంభమైన వెటరన్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్‌లో కడప మాస్టర్స్ జట్టు, హైదరాబాదు వెటరన్స్ జట్టు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప మాస్టర్స్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాదు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 120 పరుగులు చేసింది. ఆ జట్టులోని నితిష్ కుమార్ 48 పరుగులు చేశారు. కడప మాస్టర్స్ జట్టులోని బాలాజీ 2, అశ్విన్‌కుమార్ రాజు 2, భరత్‌రెడ్డి 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం 121 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన కడప మాస్టర్స్ జట్టు 12.2 ఓవర్లలో 1 వికెట్ నష్టానికి 121 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ జట్టులోని జి.శ్రీధర్ అబ్బుతంగా బ్యాటింగ్‌లో రాణించాడు. 85 పరుగులు(నాటౌట్) చేశాడు. మహేంద్ర 21 పరుగులు చేశాడు. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా కడప జట్టుకు చెందిన జి.శ్రీధర్ ఎంపికయ్యారు.

సాహిత్య కృషి గొప్పది

ప్రజాశక్తి - కడప అర్బన్

పద్యకవిగా పాలా వెంకటసుబ్బయ్య, అవధానిగా సి.పి.సుబ్బన్న సాహితీకృషి గొప్పదని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు డాక్టర్ మూల మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం సాయంత్రం ప్రసిద్ధ పద్యకవి పాలా వెంకటసుబ్బయ్య 110వ జయంతి, ప్రసిద్ధ అవధాని సి.వి.సుబ్బన్న 94వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పాలా వెంకటసుబ్బయ్య సి.వి.సుబ్బన్న చిత్రపటాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యులు మాట్లాడుతూ పాలా వెంకటసుబ్బయ్య అనేక పద్యకావ్యాలు, నాటకాలు, నాటికలు, నవలలు, కథలు, ఆంగ్లరచనలు చేశారని అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ పాలా వెంకటసుబ్బయ్య కలభాషిణి అనే పత్రికను నడిపారని, విజయవివేకానందం, భాగమతి, మల్లీశ్వరి అనే చారిత్రక కావ్యాలను రచించారని అన్నారు. సి.వి.సుబ్బన్న శతావధాని ప్రసిద్ధ కవయిత్రి గంటి కృష్ణవేణమ్మ ప్రోత్సాహంతో అవధానాలు చేయడం ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో గంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, కుమార్, సాయిరామ్, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకట రమణ, మౌనిక, పాఠకులు ప్రసాద్, మధుసూదన్ రెడ్డి, వై.యన్.కుమార్‌రావు పాల్గొన్నారు.

బిటెక్ విద్యార్థులకు అవగాహన

కడప అర్బన్: కెఎస్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 2022- 23 విద్యాసంవత్సరానిగాను బీటెక్ మొదటి సంవత్సరం ప్రవేశించిన విద్యార్థులకు కళాశాల హ్యుమానిటీస్ అండ్ సైన్స్ కెరీర్ డెవలప్మెంట్ సెల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నైతిక విలువలు, ఎథిక్స్ గోల్డ్ సెట్టింగ్ అనే అంశాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎంచుకున్న ఇంజినీరింగ్ బ్రాంచ్‌పై మంచి అవగాహనతో పాటు తోటి విద్యార్థులు, అధ్యాపకులు మధ్య సంబంధాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. కమ్యూనికేషన్స్, ఇతర నైపుణ్యాలను అవగాహన ఆకలింపు చేసుకోవాలని దిశ నిర్దేశం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి ఎస్ ఎస్ మూర్తి, హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి డాక్టర్ శ్రీవాణి, సమన్వయకర్తలు ఈశ్వర్ రెడ్డి, రాజేంద్ర కుమార్, ఆనందరావు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీలపై కపట ప్రేమ : టిడిపి

చెన్నూరు: వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీలపై కపట ప్రేమ చూపుతోందని, ముస్లిముల పవిత్రను కాపాడాలని ఉంటే హౌజ్‌హస్‌ను మనుగడలోకి తీసుకురావాలని టిడిపి మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్, ఖాజాహుసేన్, మంజూర్‌అహ్మద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో వారు విలేకర్లతో మాట్లాడారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మండలంలోని మైనార్టీ కాలనీలో శ్మశాన పనులకు, సిసి రోడ్లకు అనేక లక్షలు ఖర్చు చేశారని తెలిపారు. గత ప్రభుత్వంలో హజ్ హౌస్‌ను నిర్మిస్తే వైసిపి ప్రభుత్వం పూర్తిగా వదిలేసిందని వాపోయారు. కమలాపురం నియోజకవర్గంలో మైనారిటీలకు పుత్తా నరసింహారెడ్డి హయాంలో లబ్ధి చేకూరిందని తెలిపారు. సమావేశంలో మైనార్టీ నాయకులు గౌస్ పీర్, ఖాజా, అబ్దుల్లా, సాధిక్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొప్పుల విజయ్ కుమార్‌కు ఎక్సలెన్సీ అవార్డు

కడప అర్బన్: సోసియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యుమాన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్‌కు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డును తమిళనాడులోని హొసూర్‌లో శనివారం ఇంటర్నేషనల్ అచివర్స్ కౌన్సిల్, ఆసియన్ వేదిక్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యుమాన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణ కోసం కృషి చేస్తున్నామన్నారు. ఇంటర్నేషనల్ అచివర్స్ కౌన్సిల్ నుంచి చేసిన సేవలను గుర్తించి అబ్దుల్ కలాం ఎక్సలెన్సీ అవార్డు రావడంతో మరింత ఎక్కువ భాధ్యత పెరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ తాము చేసే పనిని ఒక బాధ్యత అని నిర్వహిస్తే ఇలాంటి గుర్తింపు దక్కుతుందని ఆయన అన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీహరి

జిల్లా స్థాయి క్రీడల్లో మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-పుల్లంపేట

పులివెందులలో జరిగిన ఉమ్మడి కడప జిల్లా సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ అండర్-17, 14 విభాగాలలో మండలంలోని ఎపి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్-17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ విభాగాలలో అరవింద రోహిత్, హరి, ప్రీత్ విష్ణు, శ్రీజ ఎంపికయ్యారు. అండర్-14 విభాగాలలో జీవన్‌రెడ్డి, దినేష్, చైతన్య, మోహిత్, విగ్నేష్, బాల ఆదిత్య, సంతోష్, జోష్న, లహరి, శిరీష, కీర్తన ఎంపికయ్యారు. ప్రిన్సిపల్ శ్రీహరి క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ మోడల్ స్కూల్ నుండి జిల్లా స్థాయి ఎంపికలలో 18 మంది బాలబాలికలు ఎంపికవడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడలకు కూడా ఇక్కడ మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అనేక మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటారని క్రీడల వలన భవిష్యత్తులో ఎదురయ్యే సవాళు ఎదుర్కొనే అవకాశం ఉంటుందని గెలుపు ఓటముల వలన సమానంగా తీసుకున్నప్పుడే జీవితంలో ఉన్నత స్థితికి ఎదగవచ్చని సూచించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు నిలకంఠను కూడా అభినందించారు.




వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ కిషోర్ కుమార్‌రెడ్డి

ఇంటి వద్దకే వైద్య సేవలు

ప్రజాశక్తి-కలకడ

104 వాహనం ద్వారా ఇంటి వద్దకే సేవలు వస్తున్నాయని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిషోర్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని కె.దొడ్డిపల్లిలో రెండో విడత 108 వాహన సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని, వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు వస్తుంటాయని, వాటిపట్ల జాగ్రత్తగా ఉండాలని ఏమైనా విష జనాలు వస్తే స్థానిక వైద్యశాల కెళ్ళి చికిత్సలు పొందాలన్నారు. బాలింతలు, గర్భిణులు పోషకాహారాలు తప్పనిదిగా తీసుకొని పుట్టిన బిడ్డకు సరైన మోతాదులో పౌష్టికాహారాలు అందించాలన్నారు. గర్భిణులకు అనీమియా వ్యాధి చెప్పకుండా రక్తం సమృద్ధిగా ఉండేలా చూడాలన్నారు. స్థానికంగా ఉన్న వైద్యశాలను సంప్రదించి వైద్యశాల పొందాలన్నారు. కార్యక్రమంలో 104 వైద్యాధికారిని ప్రియాంక, ఎంపిహెచ్ ఇఒ జయరామయ్య, వైద్య, 104 వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న జనసేన నాయకులు

'కొండల్లో కాలనీల ఏర్పాటు సరికాదు'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కొండల్లో బండల్లో జగన్ కాలనీలు ఏర్పాటు చేయడం దారుణని జనసేన నాయకులు అన్నారు. శనివారం జనసేన నాయకులు కొండలు, గుట్టల్లో ఏర్పాటు చేసిన కాలనీలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదలకు ఇళ్లను కొండల్లో, బండల్లో ఇస్తున్నారని తెలిపారు. ఇళ్ల కట్టుకోవడానికి ఇస్తున్న రూ.1.60 లక్షలు పునాదికే సరిపోవడం లేదన్నారు. రూ.రెండు లక్షలకుపైగా ఖర్చు అవుతుండడం చూస్తే ప్రభుత్వం ప్రజలని ప్రజల సంక్షేమం కోసం కాదు ప్రజలను దగా చేయడం కోసమే జగనన్న కాలనీలు పేరిట ఇళ్లు ఇస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా కళ్ళు తెరిచి ప్రజలకు అనువైన ప్రదేశాల్లో కాలనీలు, ఇచ్చిన కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శోభ, రూప, మహేంద్ర, నరేష్, మనోజ్, శ్రీకాంత్, మహేష్ బాబు, సోను పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి : డైరెక్టర్

ప్రజాశక్తి-గుర్రంకొండ

రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న సిబ్బంది రైతులకు అందుబాటులో రావడంలేదని, వారు అందుబాటులో ఉండాలని ఆర్‌బికె డైరెక్టర్ నాగరాజా అన్నారు. శనివారం ఆర్‌బికె సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు రైతులు పండిస్తున్న పంటలకు ఎలాంటి వైరస్ వర్తిస్తుందో తెలియక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏ తెగులుకు ఏ మందులు వాడాలో రైతులకు అధికారులు సూచించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్‌బికె చైర్మన్ జయచంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ జమీర్ అలీ ఖాన్, ఆర్‌బికె డైరెక్టర్ జగన్నాధ్, అధికారులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి నందలూరు

ముగ్గురు క్షయ వ్యాధి గ్రస్తులను దత్తకు తీసుకున్నట్లు, ఈరోజు నుండి నెల నెల వారికి నిత్యవసర సరుకులు ఆరు నెలల పాటు పంపిణీ చేస్తామని జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు ఖలీమ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తు లను వైద్యాధికారులు గుర్తించడం అందరికీ తెలిసిందే అయితే డాక్టర్ సృజన క్షయ వ్యాధుల బారిన పడిన వారిని మానవతా దృక్పథంతో ఆదుకోవాలని దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో మండలంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న జనాబ్ ఎస్టీ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ వారు ముగ్గురు క్షయ వ్యాధి గ్రస్తులను దత్తకు తీసుకున్నట్లు ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో దాతలు అబ్బాస్ బిల్డర్స్ అండ్ డెవలపర్స్ అధినేత సయ్యద్ అమీర్, అఖిల్ టికెట్ హబ్స్ అధినేత సయ్యద్ జుల్ఫికర్, నాగిరెడ్డిపల్లె మాజీ సర్పంచ్ నడివీధి సుధాకర్, ఏజిపి సమీ ఉల్లా ఖాన్ మైనార్టీ నాయకులు నూర్ మహమ్మద్, ఆరోగ్య శాఖ సిబ్బంది ప్రకాష్, ఆశా వర్కర్ తులసి, లక్ష్మయ్య పాల్గొన్నారు.



క్షయ రోగులకు సరుకులు పంపిణీ చేసిన దాతలు



సమావేశంలో మాట్లాడుతున్న బత్యాల చెంగల్రాయుడు

పుకార్ల సృష్టించడం తగదు : 'బత్యాల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

తాను పార్టీ మారుతున్నానని కొందరు పుకార్లు సృష్టించడం సరికాదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు అన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వారం రోజులుగా జనసేన, వైసిపిలో చేరుతున్నానని పుకార్లు సృష్టిస్తున్నారని, తాను ఏ పార్టీలోనూ చేరడం లేదని స్పష్టం చేశారు. వైసిపి, జనసేన, కమ్యూనిస్టు పార్టీల్లో చాలా మంది తనకు తెలిసిన వారు ఉన్నారన్నారు. వారితో మాట్లాడినంత మాత్రాన పార్టీలోకి చేరినట్లు అవుతుందా అని ప్రశ్నించారు. వైసిపి నేతలు పలుచోట్ల వారి పార్టీలో చేరుతునట్లు చేస్తున్న దుష్ప్రచారాన్ని వెంటనే ఆపాలన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాలని, ప్రజలందరూ కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనన్నారు. ప్రజాబలం ఉన్న నాయకుల అవసరం ప్రతి పార్టీకి ఉంటుందని ఇలా ప్రజాబలం ఉన్న నాలాంటి నాయకులపై ఇలాంటి దుస్ప్రచారాలు ఆపాలన్నారు. ప్రజా సమస్యలపై స్పందించి ప్రజల మెప్పు పొందాలని తెలిపారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మా శివ, వార్డు మెంబర్లు నార్జాల హేమరాజ్, పోతురాజు నవీన్, వడ్డిపల్లి ఈశ్వరయ్య, పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటసుబ్బయ్య యాదవ్, ఎస్సీ సెల్ పార్లమెంటు ఉపాధ్యక్షుడు తేనెపల్లి చిన్న, మైనార్టీ నాయకురాలు షహనాజ్ బేగం, మాజీ ఎంపిటిసి గ్రందే బాలసుబ్రమణ్యం, కస్తూరి సుధాకర్, పోతురాజు సుమన్, సి.మహేష్ చౌదరి, కానగల సుబ్బరాయుడు, ఈశ్వర్, గుంటి హేమంత్ కుమార్, శంకర్, వినోద్, సోడిశెట్టి మణి శంకర్ ఇంకా, టైలర్ రాము పాల్గొన్నారు.

బదిలీల్లో అర్హులకు అన్యాయం

నందలూరు: నేతల సిఫారసులతో అక్రమ పద్ధతిలో ప్రభుత్వం చేస్తున్న దొడ్డిదారి ఉపాధ్యాయ బదిలీలు అన్యాయమని ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అల్లం అశోక్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయ సాధారణ బదిలీలు జరపకుండా కాలయాపన చేస్తూ, నేడు వందలాది సిఫారసు బదిలీలు చేయడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి మారుమూల గ్రామాలలో పనిచేస్తున్న వారు, తిరిగి అదే మారుమూల ప్రాంతాలలో పనిచేయాల్సి వస్తుందన్నారు. ఉపాధ్యాయ బదిలీలు పారదర్శకంగా నిర్వహిస్తామని ఆరు నెలలుగా చెబుతున్న ప్రభుత్వ పెద్దలు, నిబంధనలకు విరుద్ధంగా అడ్డదారి బదిలీలు చేసి, అర్హులకు అన్యాయం చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలన్నారు. బదిలీలు జరుగుతాయో లేదోనన్న ఆందోళన నెలకొందన్నారు. సిఫారసు బదిలీలను రద్దు చేసి, సాధారణ బదిలీలను నిర్వహించకపోతే సంఘాలన్నీ ఏకతాటిపైకి వచ్చి,ఉద్యమం చేపట్టక తప్పదన్నారు. నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న డిఎ, జడ్పీపిఎఫ్, ఎపిజిఎల్ఐ, సరెండర్ లీవ్ బిల్లుల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్



ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన కారు

కారు బోల్తా : మహిళ మృతి

ప్రజాశక్తి-కలకడ

కారు అదుపుతప్పి బోల్తా పడడంతో మహిళ మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జిల్లాలోని రాయచోటి కంసలవీధిలో కాపురం ఉంటున్న ఇబ్రహీం భార్య సాజియా(35) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం వైద్యం కోసం తిరుపతికి కారులో బయలుదేరారు. ఈ క్రమంలో రాయచోటి నుండి తిరుపతికి వెళ్లే మార్గంలో చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిలోని కలకడకు సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా పడింది. కారు డ్రైవర్ ఫైరోజ్‌ఖాన్‌కు రక్త గాయాలు కాగా కారులో ప్రయాణిస్తున్న సాజియా కారులోని మృతి చెందారు. ప్రమాద విషయం తెలుసుకున్న ఎఎస్ఐ బాలకృష్ణ తన సిబ్బందితో హుటాహుటిన ప్రమాద స్థలానికి వెళ్లి పరిశీలించి రక్త గాయాలైన డ్రైవర్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం రాయచోటికి తరలించినట్లు తెలిపారు. కారులో విగతి జీవితపడి ఉన్న సాజియా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలు రాయచోటిలో బ్యూటీ పార్లర్ నిర్వహిస్తూ సంపాదనతో జీవనం గడిపేదని సాజియా మృతితో కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు వాపోతున్నారు. సాజియా మృతితో భర్త, కుమారులు, కుమార్తెలు బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి భర్త ఇబ్రహీం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఘర్షణ : ఇరువురిపై కేసు నమోదు

ప్రజాశక్తి -కలకడ

భూ తగాదాలతో ఘర్షణ పడి మహిళను గాయపరిచిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్ కుమార్ తెలిపారు. గుర్రంకొండ మండలం టి.రాచపల్లి పంచాయితీ గంగిరెడ్డిగారిపల్లి చెందిన మల్లికార్జున భార్య పూర్ణమ్మను అదే గ్రామానికి చెందిన రాజన్న అతని కుమార్తె శోభ రాణి కలసి భూ తగాదాల కారణంగా కొట్టి గాయపరిచినట్లు పూర్ణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూలపల్లిలో ఘర్షణ : ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మండలంలోని కుర్నూతల పంచాయతీలోని మూలపల్లెలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణలో ఓబుల్‌రెడ్డి, వెంకటరామిరెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. గాయపడిన వారిని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. ఓబుల్‌రెడ్డి వెంకట్రామిరెడ్డిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మూలపల్లికి చెందిన ఓ ప్రేమ జంట వివాహంలో చోటు చేసుకున్న పరిణామాలతో యువతి, యువకుడి బంధువులు గొడవలు పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయంలో యువతి, యువకుని బంధువులు మాటామాటా పెరిగి ఘర్షణ చోటుచేసుకుని యువతి బంధువులపై దాడి చేశారని తెలిపారు.



తీవ్రంగా గాయపడిన ఓబుల్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి